www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 225, బుధవారం 16-9-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు : 6 వేల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam

**గంజాయి సరఫరా, సైబర్ నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాలు నివారణపై ప్రత్యేక దృష్టి పట్టాలి**



4లో..

**ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యంగా అధికారులు పనిచేయాలి**



5వ పేజీల్లో

## ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి

# సింగపూర్ మాస్టర్ ప్లాన్

### ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి సింగపూర్ మాస్టర్ ప్లాన్.. నిజాం వారసత్వ సంపదను పునరుద్ధరించండి

### ఫ్యూచర్ సిటీలో ఆగా ఖాన్ యూనివర్సిటీని ఏర్పాటు చేయండి

### ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్‌తో రేవంత్ భేటీ.. గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కావాలని సీఎం రేవంత్ వినతి

**హైదరాబాద్, సెప్టెంబర్ 15:**

హైదరాబాద్‌లోని తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ప్రిన్స్ రహీమ్ ఆగాఖాన్-Vతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా సమావేశమ య్యారు. ఈ భేటీలో మంత్రి అజారుద్దీన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం సలహా దారు రామకృష్ణారావు, వివిధ శాఖల ఉన్నతా ధికారులు, ఆగా ఖాన్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఇటీవల దివంగతులైన ప్రిన్స్ రహీమ్ తండ్రి ఆగా ఖాన్-IV మృతి పట్ల సీఎం సంతాపం తెలిపారు. హైదరాబాద్‌తో ఆగా ఖాన్ కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ, తెలంగాణ వారసత్వ సంపద పునరుద్ధరణలో ఫౌండేషన్ పోషిస్తున్న పాత్రను కొనియాడారు. శాసనమండలి భవనం, కుతుబ్ షాహీ టూంబ్స్ అభివృద్ధిలో ఫౌండేషన్ అందించిన సహకారాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు.

**మూసీ పునరుజ్జీవనం, చారిత్రక భవనాల పునరుద్ధరణ**

మూసీ నది పునరుజ్జీవనం ద్వారా నైట్ ఎకానమీని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని సీఎం వివరించారు. ఈ పరివాహక ప్రాంతంలోని చారిత్రక ఆధారాలైన సిటీ కాలేజ్, ఉస్మానియా ఆసుపత్రి భవనాల పునరుద్ధరణకు ఆగా ఖాన్ ఫౌండేషన్ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఉస్మానియా ఆసుపత్రికి గోషామహల్‌లో నూతన భవనం నిర్మిస్తున్నామని, ప్రస్తుతం ఉన్న పాత భవనాన్ని వారసత్వ సంపదగా గుర్తించి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పునరుద్ధరించాలని కోరారు.



శంషాబాద్ విమానాశ్రయం సమీపంలో 30 వేల ఎకరాల్లో నిర్మిస్తున్న 'భారత్ ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టుపై ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్ ఆసక్తి కనబరిచారు. దీనిని 15 వేల ఎకరాల గ్రీన్ జోన్‌తో నెట్-జీరో సిటీగా తీర్చిదిద్దుతున్నామని, సింగపూర్ కంపెనీ మాస్టర్ ప్లాన్ రూపొందిస్తోందని సీఎం వెల్లడించారు. ఇప్పటికే అమెజాన్ వంటి అంతర్జాతీయ సంస్థలు ఇక్కడ కార్యకలాపాలు ప్రారంభించాయని వివరించారు. ఫ్యూచర్ సిటీలో ఆగా ఖాన్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా ఈ సందర్భంగా ప్రతిపాదించారు.

**తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానం**

2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మార్చడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, దేశ జీడీపీలో రాష్ట్ర వాటాను 10 శాతానికి పెంచుతామని రేవంత్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా డిసెంబర్ 7 నుంచి మూడు రోజుల పాటు భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా నిర్వహించనున్న 'తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు హాజరు కావాల్సిందిగా ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్‌ను ఆహ్వానించారు.



## రేవంత్‌తో ఎలాంటి

# విభేదాలు లేవు

### కొండా సురేఖను బర్తరఫ్ చేయడం బాధాకరమే

### టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్

**హైదరాబాద్, సెప్టెంబర్ 15 :**

హైదరాబాద్‌లో మంగళవారం మీడియా తో చిట్‌చాట్ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ పార్టీ అంతర్గత వ్యవహా రాలు, ఇటీవలి పరిణామాలపై మాట్లా డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, తనకు మధ్య ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని, పార్టీని సమన్వ యంతో ముందుకు తీసుకెళుతున్నామని తెలిపారు."పార్టీ క్రమశిక్షణే అత్యంత ప్రధానం. ఏఐసీసీ నిర్దేశించిన హద్దులు, పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవు" అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. పార్టీలో ఏమైనా సమస్యలు ఉంటే అంతర్గత వేదికలపై చర్చించుకోవాలని సూచించారు. విషయాలను బహిరంగంగా మాట్లాడి క్రమశిక్షణ ఉల్లంఘిస్తే అధిష్ఠానం ఉపేక్షించదని స్పష్టం చేశారు.రేవంత్‌రెడ్డితో కలిసి ప్రజా సంక్షేమం విస్తరణ, తెలంగాణలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయడమే తమ లక్ష్యమని మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పారు. తమ మధ్య గ్యాప్ ఉ ందంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దని కోరారు.కాంగ్రెస్ కార్యకర్తల కష్టంతోనే తెలంగాణలో పార్టీ అధికారంలోకి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. సాధారణ కార్యకర్తలకు సైతం పార్టీలో కీలక పదవులు దక్కుతున్నాయని చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి ఒక్కరినీ గుర్తిస్తామని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. పార్టీ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నేతలు, కార్యకర్తలు క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు.

# నా పీఆర్ఓపై కాంగ్రెస్ గూండాల దాడి



### తెలంగాణ పోలీసులపై నమ్మకం పోయింది

### ఇక న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం

### సైఫాబాద్ పోలీస్ స్టేషన్ లో ముసుగు వీరులు దాడికి పాల్పడ్డారన్న కేటీఆర్

### పీఎస్ బయట, లోపల ఉన్న సీసీటీవీ ఫుటేజీని భద్రపరచాలని డిమాండ్

**హైదరాబాద్, సెప్టెంబర్ 15:**

హైదరాబాద్ లోని సైఫాబాద్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో తన పీఆర్ఓ మహేశ్ మాణిక్య, పీఏ మహేందర్ రెడ్డిపై దాడి చేశారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. యూనిఫాంలో ఉన్న పోలీసు అధికారుల సమక్షంలోనే ముసుగులు ధరించిన 15 మంది గుండాలు లోపలికి చొరబడి పక్కా ప్రణాళికతో ఈ దాడికి పాల్పడ్డారని... రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ వైఫల్యానికి ఇది నిదర్శనమని అన్నారు. ముఖ్యమంత్రి, హోంమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణ రౌడీ రాజ్యంలా మారిందని, అణచివేతకు తలొగ్గని ప్రతీ పౌరుడికీ భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులే ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.అసెంబ్లీ గేటు ఘటనకు సంబంధించి హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి ఉన్నప్పటికీ, రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే విచారణ పేరుతో ఉదయాన్నే స్టేషన్‌కు పిలిపించి చీకటి పడే వరకు కాలయాపన చేసి ..మిగతా 2లో



### 22-ఏ నిషేధిత భూముల జాబితాపై

# ప్రభుత్వం కసరత్తు

### నేడు అసెంబ్లీలో చర్చించేందుకు సిద్ధం

### సాయంత్రం అందుబాటులో ఉన్న మంత్రులతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశం

**హైదరాబాద్, సెప్టెంబర్ 15 :**

22-ఏ నిషేధిత భూముల జాబితాపై తెలంగాణ ప్రభుత్వం కీలక కసరత్తు చేస్తోంది. రేపు అసెంబ్లీలో 22-ఏ భూముల అంశంపై సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం ఇవ్వనున్నందున సీఎం పలువురు మంత్రులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ ఎంసీహెచ్‌ఆర్డీ క్యాంపు కార్యాలయంలో జరుగుతున్న ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వివేక్ వెంకటస్వామి హాజరయ్యారు. 22-ఏ జాబితాలో ఉన్న భూముల విషయంలో ప్రజలు, భూ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశంలో ప్రధానంగా చర్చించిన్నట్లు తెలుస్తోంది. నిషేధిత జాబితాలో ఉన్న భూములను పరిశీలించి అర్హమైన భూములను జాబితా నుంచి తొలగించడం, సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించే మార్గాలపై మంత్రులతో సీఎం చర్చించిన్నట్లు సమాచారం. అదేవిధంగా భూముల రిజిస్ట్రేషన్ల విషయంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలపైనా సమాలోచనలు చేసినట్లు సమాచారం.

రేపటి అసెంబ్లీ చర్చలో ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని వెల్లడించేలా ఇప్పటికే వివిధ శాఖల నుంచి అందిన సమాచారం, 22-ఏ భూములకు సంబంధించిన వివరాలను సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలించారు. మంత్రుల నుంచి సలహాలు, సూచనలు తీసుకుంటూ అసెంబ్లీలో ఇవ్వాల్సిన సమాధానంపై తుది కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తం మీద 22-ఏ నిషేధిత భూముల జాబితా ప్రక్షాళన, భూ యజమానుల సమస్యల పరిష్కారం, రిజిస్ట్రేషన్లకు ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించే అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించింది.

గతంలో 22ఏ భూముల విషయంలో జరిగిన పరిణామాలు, ప్రస్తుతం ఉన్న సమస్యలు, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సభలో ..మిగతా 2లో

### పసుపు నీళ్ల వివాదంలో నిందితులను

# అరెస్టు చేయొద్దు: హైకోర్టు

### అరెస్టులపై పోలీసుల తీరును తప్పుబట్టిన హైకోర్టు



**హైదరాబాద్, సెప్టెంబర్ 15:**

ఎర్రవల్లి పసుపు నీళ్ల వివాదంలో తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో నిందితులను వెంటనే అరెస్టు చేయొద్దని ధర్మాసనం ఆదేశించింది. కేవలం నోటీసులు ఇచ్చి దర్యాప్తు కొనసాగించాలని పోలీసులకు స్పష్టం చేసింది.ఏడేళ్లలోపు శిక్ష పడే సెక్షన్ల కింద కేసులు నమోదైనప్పుడు నిందితులను ఎలా అరెస్టు చేస్తారని హైకోర్టు ప్రశ్నించింది. ఈ విషయంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నాయని గుర్తుచేసింది. వాటిని పక్కనపెట్టి అరెస్టులకు ఎలా వెళతారని పోలీసుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించవద్దని హెచ్చరించింది.మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ ఉన్న ఎర్రవల్లి ప్రాంతంలో కాంగ్రెస్ నిర్వహించిన నిరసన కార్యక్రమం తర్వాత ఈ వివాదం మొదలైంది. నిరసన జరిగిన ప్రాంతాన్ని బీఆర్ఎస్ కార్యకర్తలు పసుపు నీళ్లతో శుద్ధి చేశారు. ఈ ఘటన రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది.ఈ వ్యవహారంపై కాంగ్రెస్ నేతలు, స్థానికుల ఫిర్యాదులతో పోలీసులు కేసు నమోదు చేశారు. వివిధ సెక్షన్ల కింద కేసులు పెట్టారు. నిందితులను అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నించడంతో వారిలో కొందరు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిపిన ధర్మాసనం.. నిందితుల అరెస్టుపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. తదుపరి చర్యలను నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని పోలీసులను ఆదేశించింది.



# పరస్పర గౌరవం, ప్రయోజనం, సున్నితత్వం పాటిద్దాం

### శత్రువులం కాదు... మనం భాగస్వాములం

### జిన్‌పింగ్‌తో భేటీలో భారత్ ఆందోళనలు ప్రస్తావించిన ప్రధాని మోదీ

### వివరాలు వెల్లడించిన భారత విదేశాంగ శాఖ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15 :**

న్యూఢిల్లీలో జరుగుతున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఇరు దేశాలు పరస్పరం ఆందోళనలను అర్థం చేసుకుని, సున్నితత్వంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ ఉద్ఘాటించినట్లు భారత విదేశాంగ శాఖ (ఎంఈఏ) వెల్లడించింది.ఈ భేటీకి సంబంధించిన వివరాలను విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మంగళవారం మీడియాకు వివరించారు. "పరస్పర గౌరవం, పరస్పర ప్రయోజనం, పరస్పర సున్నితత్వం" అనే మూడు ప్రధాన సూత్రాల ప్రాతిపదికన ద్వైపాక్షిక సంబంధాలు ముందుకు సాగాలని ..మిగతా 2లో

# విశ్వేశ్వరయ్య స్ఫూర్తితో భవిష్యత్ తరాలకు మెరుగైన జల వ్యవస్థలు

## జలమండలి ఇంజినీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా ఇంజినీర్స్ డే

## ప్రస్తుత--మాజీ ఇంజినీర్ల ఆత్మీయ సమ్మేళనం...పదవీ విరమణ చేసిన సీనియర్ ఇంజినీర్లకు ఘన సన్మానం









**గద్వాల్ల , సెప్టెంబర్ 15:**

భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని మంగళవారం ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో ఇంజినీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంజినీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. జలమండలి ప్రస్తుత, మాజీ, పదవీ విరమణ చేసిన ఇంజినీర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని విశ్వేశ్వరయ్య సేవలను స్మరించుకున్నారు.

జలమండలి ఎండీ అశోక్ రెడ్డి కార్యక్రమంలో పాల్గొని ఇంజినీర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జలమండలికి విశేష సేవలందించి పదవీ విరమణ చేసిన సీనియర్ ఇంజినీర్లను ఘనంగా సన్మానించారు. ప్రస్తుత, మాజీ ఇంజినీర్లు తమ అనుభవాలు, జ్ఞాపకాలను పంచుకున్నారు.హైదరాబాద్ జల వ్యవస్థల అభివృద్ధిలో విశ్వేశ్వరయ్య చూపిన దూరదృష్టిని ఈ సందర్భంగా సీనియర్ ఇంజినీర్లుగుర్తుచేసుకున్నారు. వరద నియంత్రణ, తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాలు, గ్రావిటీ ఆధారిత నీటి సరఫరా వ్యవస్థలు శతాబ్ద కాలం తరువాత కూడా సేవలందిస్తుండటం ఆయన ఇంజినీరింగ్ ప్రతిభకు నిదర్శనమని పేర్కొన్నారు.

నగర విస్తరణతో తాగునీటి అవసరాలు పెరిగి మంజీరా, సింగూరు, కృష్ణా, గోదావరి వంటి వనరుల వరకు జలమండలి నీటి సరఫరా వ్యవస్థ విస్తరించిందన్నారు. గత తరాలు నిర్మించిన మౌలిక వసతులను పరిరక్షిస్తూ, మారుతున్న అవసరాలకు అనుగుణంగా స్థిరమైన, నాణ్యమైన వ్యవస్థలను భవిష్యత్ తరాలకు అందించడం నేటి ఇంజినీర్ల బాధ్యత అని పేర్కొన్నారు.సాంకేతిక పరిజ్ఞానం, ఆవిష్కరణలను అందిపుచ్చుకుని తక్కువ నిర్వహణ వ్యయంతో దీర్ఘకాలం ప్రజలకు ఉపయోగపడే వ్యవస్థల రూపకల్పనపై యువ ఇంజినీర్లు దృష్టి పెట్టాలని సీనియర్ ఇంజినీర్లు సూచించారు. విశ్వేశ్వరయ్య దూరదృష్టి, నిబద్ధత, ప్రజాప్రయోజన దృక్పథాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

పరిశోధన--ఆవిష్కరణలపై ప్రత్యేక ప్రదర్శన:

ఈ కార్యక్రమంలో డిఎంఆర్ఎల్ (డీఆర్డీఓ) సీనియర్ శాస్త్రవేత్త ఫణి సూర్యకిరణ్ పాల్గొని ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రభుత్వ సంస్థల్లో పరిశోధన--అభివృద్ధి వ్యవస్థల పనితీరు, నూతన సాంకేతికతలపై పరిశోధన, ఆవిష్కరణలను క్షేత్రస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడం తదితర అంశాలను వివరించారు. పరిశోధన ఆధారిత ఆవిష్కరణలు సంస్థల పనితీరు, సేవల నాణ్యతను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జలమండలి సైబరాబాద్ ఈడీ సంతోష్, ఆపరేషన్ డైరెక్టర్లు నారాయణ, ప్రభు, సత్యనారాయణ, ప్రాజెక్టు డైరెక్టర్ మహేష్ కుమార్, రెవెన్యూ డైరెక్టర్ కిరణ్ కుమార్, మాజీ డైరెక్టర్లు డా. రామేశ్వర్ రావు, ఎంబీ ప్రవీణ్ కుమార్, వీఎల్ ప్రవీణ్ కుమార్, శ్రీధర్ బాబు, రవి, స్వామి, అమరేందర్ రెడ్డి, వినోద్ భార్గవ, ఇంజినీర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, పదవీ విరమణ చేసిన ఇంజినీర్లు, అధికారులు పాల్గొన్నారు.







# నా పీఆర్ఓపై కాంగ్రెస్ గూండాల దాడి

**మొదటి పేజీ తరువాయి...**

ఈ కుట్రకు తెరలేపారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ గుండాలు ఈ దాడికి పాల్పడ్డారా? లేక పోలీసులే మఫ్టీలో ముసుగులు వేసుకుని వచ్చారా? అనే దానిపై నిజాలు బయటకు రావాలంటే తక్షణమే సిట్టింగ్ జడ్జితో స్వతంత్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. స్టేషన్ లోపల, బయట ఉన్న సీసీటీవీ ఫుటేజీని వెంటనే భద్రపరచాలని, గాయపడిన తన సిబ్బందికి రక్షణ కల్పించి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఈ చర్యలను నిరసిస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని 'ఎక్స్' వేదికగా ట్యాగ్ చేస్తూ 'వెల్‌డన్ కాంగ్రెస్' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

## 22-ఏ నిషేధిత భూముల జాబితాపై

# ప్రభుత్వం కసరత్తు

**మొదటి పేజీ తరువాయి...**

వివరించే అవకాశం ఉంది. అదే విధంగా అసెంబ్లీలో 22ఏ అంశాన్ని ఎలా ప్రస్తావించాలి, ప్రతిపక్షాల విమర్శలకు ఏ విధంగా సమాధానం ఇవ్వాలనే దానిపైనా మంత్రులతో చర్చించినట్లు తెలుస్తోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న భూ అక్రమాల అంశాన్ని కూడా రేపు సభలో ప్రస్తావించాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు తెలుస్తోంది. 22ఏ భూముల వ్యవహారంలో అసలు సమస్యకు కారణాలేంటి? గతంలో భూముల కేటాయింపులు, రిజిస్ట్రేషన్లు ఎలా జరిగాయి? ఎవరి హయాంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నారు? అనే అంశాలను సభా వేదికగా సీఎం వివరించే అవకాశం ఉంది. మొత్తంగా 22ఏ భూముల అంశంపై రేపటి అసెంబ్లీ చర్చకు ముందే రేవంత్ రెడ్డి మంత్రులతో కసరత్తు చేసినట్లు సమాచారం. ఒకవైపు ప్రభుత్వ నిర్ణయంపై స్పష్టత ఇవ్వడంతోపాటు, మరోవైపు నిజంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న సామాన్యులకు వెసులుబాటు కల్పించేలా పరిష్కార మార్గాలను అన్వేషించిన్నట్లు తెలుస్తోంది.

# యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ ఛార్జీలు ఖరారు..

## కస్టమర్లపై భారం లేదన్న ఎన్‌పీసీఐ

### రూ. 2,000 దాటిన మర్చంట్ పేమెంట్లపై 0.4 శాతం ఛార్జీ

### వినియోగదారులకు ఎలాంటి అదనపు భారం ఉండదు

### పీ2పీ, రూ. 2000 లోపు వ్యాపార చెల్లింపులు ఎండీఆర్ పరిధిలోకి రావు

### ఈ ఛార్జీలను వ్యాపారులే భరించాల్సి ఉంటుంది

### వ్యక్తిగత యూపీఐ లావాదేవీలు పూర్తిగా ఉచితం

### రైల్వే, ఇంధనం వంటి కేటగిరీలకు ప్రత్యేక ఛార్జీలు

### స్పష్టం చేసిన ఎన్‌సీపీఐ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15 :**

దేశవ్యాప్తంగా విస్తృతంగా వినియోగంలో ఉన్న యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలపై నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కీలక ప్రకటన చేసింది. వ్యాపారులకు చేసే చెల్లింపులపై కొన్ని రుసుములను ప్రవేశపెట్టినప్పటికీ, ఆ భారం వినియోగదారులపై పడదని స్పష్టం చేసింది. ఈ నిర్ణయం కోట్లాది మంది యూపీఐ వినియోగదారులకు పెద్ద ఊరటనిస్తోంది. ఎన్‌పీసీఐ తాజా నిబంధనల ప్రకారం, వ్యాపార చెల్లింపులలో (మర్చంట్ పేమెంట్స్) రూ. 2,000 దాటిన లావాదేవీలపై 0.4 శాతం రుసుము వర్తిస్తుంది. అయితే, ఈ ఛార్జీని కస్టమర్ల నుంచి వసూలు చేయకుండా వ్యాపారులే భరించాల్సి ఉంటుంది. గరిష్ఠంగా ఈ రుసుము రూ. 300 మించకుండా పరిమితి విధించారు. దీనివల్ల సాధారణ వినియోగదారులు తమ జేబు నుంచి ఎలాంటి అదనపు మొత్తం చెల్లించాల్సిన అవసరం లేదు. మొత్తం పీ2ఎం (పర్సన్ టు మర్చంట్) లావాదేవీల్లో 95 శాతానికి పైగా రూ. 2,000 లోపే ఉండటం వల్ల చిన్న వ్యాపారులపై కూడా ఎటువంటి ప్రభావం ఉండదని ఎన్‌పీసీఐ పేర్కొంది. క్రెడిట్ కార్డులు, డెబిట్ కార్డులు, వ్యాలెట్లతో పోలిస్తే సవరించిన ఈ యూపీఐ ఎండీఆర్ రుసుములు చాలా తక్కువని వెల్లడించింది.

## బీఎల్ఓ విధులతో

# అంగన్వాడీ టీచర్లపై పెరుగుతున్న భారం

### అంగన్ వాడీ టీచర్లను బీఎల్ఓ విధుల నుండి తొలగించాలి



**గద్వాల్ల , సెప్టెంబర్ 15:**

బీఎల్ఓ (ఎస్ఐఆర్) విధులతో అంగన్వాడీ టీచర్లపై తీవ్రమైన పని భారం పడిందని, దీంతో అంగన్వాడీ కేంద్రాల్లో విద్యాబోధనతో పాటు పోషకాహార సేవలు కూడా దెబ్బతింటున్నాయని అంగన్వాడీ టీచర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 10వ తేదిన గద్వాల్ పట్టణం అంబేద్కర్ నగర్ పోలింగ్ బూత్ నంబర్ 237లో బీఎల్ ఓ విధులు నిర్వహిస్తున్న అంగన్ వాడీ టీచర్ విజయ అధికారుల ఒత్తిడి తట్టుకోలేక గుండెపోటుతో మృతి చెందింది. దీంతో మంగళవారం గద్వాల జిల్లా ఐడిఓసి కార్యాలయం ముందు టీన్ జీఓ అధ్యక్షురాలు ఇందిర, వీరమ్మ, వెంకటేశ్వరమ్మ ఆధ్వర్యంలో అంగన్ వాడీ టీచర్లు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అంగన్ వాడీ టీచర్లపై అదనపు బారం వేయొద్దని కోరారు. అంగన్ వాడీ టీచర్లకు బీఎల్ఓ డ్యూటిని తప్పించాలని కోరారు. సాధారణంగా చిన్నారులకు ఆటలు, పాటలు, అక్షరాభ్యాసం, ప్రాథమిక విద్య బోధించే అంగన్వాడీ టీచర్లు ప్రస్తుతం బీఎల్ఓ విధుల కోసం ఇల్లు--ఇల్లు తిరగాల్సి వస్తోందని చెబుతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు బీఎల్ఓ విధుల్లోనే ఉండాల్సి వస్తోందని, అంగన్వాడీ కేంద్రానికి వెళ్లే అవకాశం లేక పిల్లలకు బోధన అందించలేకపోతున్నామని టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకేసారి రెండు బాధ్యతలు నిర్వహించడం వల్ల తీవ్ర మానసిక ఒత్తిడికి, ఆరోగ్య సమస్యలకు గురవుతున్నామని, కుటుంబానికి కూడ సమయం కేటాయించలేకపోతున్నామని తెలిపారు. అంగన్వాడీ సిబ్బందిపై అదనపు విధుల భారం పెంచడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పని ఒత్తిడిని తగ్గించాలని, అంగన్వాడీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్ల తో కూడిన వినతిపత్రాని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు.ఈ కార్యక్రమంలో టీఎన్జీవో యూనియన్ అధ్యక్షురాలు ఇందిర,వీరమ్మ వెంకటేశ్వరమ్మ,గిరిజ,లక్ష్మీరంగమ్మ, వెంకట్రావమ్మ, పద్మజ,వనజాక్షి, లక్ష్మీ, సుమేధ,రాజేశ్వరీ లు మదన్ మోహన్, మంజుల, పుష్ప , జిల్లాలోని అంగన్వాడి టీచర్ లు ఆయాలు పాల్గొన్నారు

# పరస్పర గౌరవం, ప్రయోజనం, సున్నితత్వం పాటిద్దాం

**మొదటి పేజీ తరువాయి...**

ప్రధాని మోదీ చైనా అధ్యక్షుడికి స్పష్టం చేశారని ఆయన తెలిపారు. భారత్‌కు ఉన్న కీలక ఆందోళనలను కూడా ఈ సందర్భంగా ప్రధాని ప్రస్తావించినట్లు జైస్వాల్ పేర్కొన్నారు.మరోవైపు, ఈ సమావేశంపై చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ స్పందిస్తూ, ఇరు దేశాలు పరస్పరం శత్రువులు కాదని, భాగస్వాములుగా కొనసాగాలనే ఏకాభిప్రాయానికి వచ్చాయని తెలిపారు. ఈ భేటీలో కుదిరిన అత్యంత కీలకమైన అంశం ఇదేనని ఆయన అభివర్ణించారు. సరిహద్దుల్లో శాంతి, సుస్థిరతలను కాపాడేందుకు ఇరువురు నేతలు అంగీకరించినట్లు ఆయన వెల్లడించారు.భారత్ చైనాకు శత్రువు కాదని, ఒక భాగస్వామి అని ప్రధాని మోదీ పేర్కొన్నట్లు చైనా మీడియా కథనాలు వెల్లడించాయి. చైనాతో తమ విధానం ఏ ఇతర దేశం ప్రభావంతోనూ ముడిపడి ఉండదని మోదీ స్పష్టం చేసినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. కాగా, 2027లో బ్రిక్స్ కూటమికి చైనా అధ్యక్షత వహించనుంది.



# గ్రామాల్లోకి ఆర్టీసీ బస్సు రాకతో 8 ఏళ్ల నిరీక్షణకు తెర

### 5 గ్రామాలకు పునరుద్ధరణ కానున్న టీజీఎస్ఆర్టీసీ బస్సు సౌకర్యం

**గద్వాల , సెప్టెంబర్ 15:**

గద్వాల నియోజకవర్గంలోని ఐదు గ్రామాల ప్రజల ఎనిమిదేళ్ల రవాణా కష్టాలు త్వరలోనే తీరనున్నాయి. గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కొండాపురం గ్రామ సర్పంచ్ ఎస్. పవన్ కుమార్ రెడ్డి మంగళవారం గద్వాల డిపో మేనేజర్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు.గత 8 సంవత్సరాలుగా కేటిదొడ్డి మండలం కొండాపురం,వెంకటాపురం,పాగుంట,ముసల్దొడ్డిఇర్కిచేడు గ్రామాలకు బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాలను సర్పంచ్ డీఎం దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాకుండ, ఈ మార్గంలో బస్సు నడపడం ద్వారా ఆర్టీసీకి వచ్చే రాబడి వివరాలను, రూట్ మ్యాప్‌ను వివరించారు. సర్పంచ్ ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించిన డీఎం, రాబోయే 20 రోజుల్లోగా ఈ ఐదు గ్రామాలకు బస్సు సౌకర్యాన్ని అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు.




# జీవో-97 రద్దు చేయాలని పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళన

**గద్వాల్ల , సెప్టెంబర్ 15:**

పాలిటెక్నిక్ విద్యను నిర్వీ ర్యం చేయడంతోపాటు ప్రైవేటీకరణ దిశగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 97 జీవోను రద్దు చేయాలని గద్వాలలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు డిమాండ్ చేశారు. మంగళవారం గద్వాల మండలం గోనుపాడు వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ముందు విద్యార్థులు బైఠాయించి నిరసన చేపట్టారు. శక్తి వద్దు.. పాలిటెక్నిక్ ముద్దు అనే నినాదంతో విద్యార్థుల భవిష్యత్తు కోసం తమ పోరాటం కొనసాగుతుందని వెల్లడించారు. ప్రభుత్వం వెంటనే జి ఓ 97ను రద్దు చేసి, పాలిటెక్నిక్ విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.పాలిటెక్నిక్ విద్య ప్రమాణాలను మరింత మెరుగుపరచాల్సిన ప్రభుత్వం అందుకు భిన్నంగా ఇతర శిక్షణ కోర్సులతో అనుసంధానం చేయడం సరికాదన్నారు. ఈ నిర్ణయం వల్ల పాలిటెక్నిక్ విద్యార్థుల విద్యాప్రమాణాలు, ఉన్నత విద్యా అవకాశాలు, ఉపాధి అవకాశాలపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి తగిన బడ్జెట్ కేటాయించకుండా విద్యా వ్యవస్థను ప్రైవేటీకరణ వైపు తీసుకెళ్లే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

# ఒత్తిడి సుడిగుండంలో 'ఐటీ' ప్రాణాలు: ఐదంకెల జీతాల చాటున మౌన రోదదన!

**శేరిలింగంపల్లి : సెప్టెంబర్ 15,:**



ఆత్మహత్యకు పాల్పడిన ఐటీ ఉద్యోగి యశ్వంత్ ఫైల్ ఫోటో .

అది ఐటెక్ సిటీ వెలుగుల వెనుక దాగున్న చేదు నిజం. నెలాఖరుకు ఖాతాలో పడే ఐదంకెల జీతం, మెరిసే ఐడీ కార్డులు, ఏసీ రూముల హోదాలు... బయటి ప్రపంచానికి కనిపించే రంగుల కలలు ఇవి. కానీ ఆ మెరుపుల వెనుక ఎంతటి ఊపిరాడని ఒత్తిడి, నిద్రలేని రాత్రులు, మానసిక నరకం దాగున్నాయో చాటిచెప్పే మరో విషాద సంఘటన హైదరాబాద్ నగరంలోని మాదాపూర్ లో ఐటి ఉ ద్యోగి బలవన మరణం కలచివేసింది. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాలు ఇలావున్నాయి.శ్రీకాకుళం జిల్లా పాత పట్నానికి చెందిన 23 ఏళ్ల యశ్వంత్ భవిష్యత్తుపై ఎన్నో ఆశలతో హైదరాబాద్ వచ్చి, గచ్చిబౌలిలోని ప్రముఖ డెలాయిట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా చేరాడు. అయ్యప్ప సొసైటీలోని అవాస కో-లివింగ్ హాస్టల్‌లో ఉంటూ కెరీర్‌లో ఉన్నత శిఖరాలకు చేరాలనుకున్న ఆ యువకుడి ఆశలు 10 రోజులకే నూరేళ్లు నిండాయి. వర్క్ ప్రెజర్ తట్టుకోలేక ఆరోగ్యం సహకరించక హాస్టల్ భవనం పైనుంచి దూకి ప్రాణాలు తీసుకున్నాడు.

**కార్పొరేట్ మాయాజాలం.. కరిగిపోతున్న నూరేళ్ల ఆయుష్షు**

లక్షల జీతం... కొండంత ఒత్తిడి.. ఐటీ ఉద్యోగం అనగానే సమాజంలో ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంటుంది. కానీ ఆ జీతంతో పాటు వచ్చే టార్గెట్లు డెడ్‌లైన్లు, నైట్ షిఫ్టులు ఉద్యోగుల మానసిక ప్రశాంతతను పూర్తిగా హరించివేస్తున్నాయి.

**ఆరోగ్యం వర్సెస్ ఆఫీస్ పని:**

తీవ్రమైన పని ఒత్తిడి వల్ల చిన్న వయసులోనే బిపి, షుగర్, గుండె సమస్యలు, డిప్రెషన్ వంటి వ్యాధుల బారిన పడుతున్నారు. యశ్వంత్ కూడా ఆత్మహత్యకు కొద్దిసేపటి ముందే బ్లడ్ చెకప్ చేయించుకున్నాడంటే అతడు ఎంతటి శారీరక, మానసిక వేదన అనుభవించాడో అర్థం చేసుకోవచ్చు.

ఏకాంతం చంపేస్తోంది: సొంత ఊళ్లను, కంటికి రెప్పలా చూసుకునే తల్లిదండ్రులను వదిలేసి హాస్టల్ గదులకే పరిమితమవుతున్న యువతకు తమ బాధను పంచుకోవడానికి కూడా సరైన మనుషులు కరువవుతున్నారు.

23 ఏళ్ల వయసంటే జీవితాన్ని ఇప్పుడిప్పుడే నిర్మించుకోవాల్సిన కాలం అలాంటి వయసులో కన్నవారికి కొండంత అండగా ఉండాల్సిన బిడ్డలు కార్పొరేట్ ఒత్తిడికి బలైపోతుంటే ఆ కడుపుకోత వర్ణనాతీతం. కంపెనీలు కేవలం ఉత్పాదకతనే కాకుండా తమ ఉద్యోగుల మానసిక ఆరోగ్యాన్ని, జీవితాలను పట్టించుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది. రూ. లక్షల జీతం ఉన్నా ప్రశాంతత లేని జీవితం వేస్ట్ అని, ఎంతటి పెద్ద సమస్యకైనా చావు ఒక్కటే పరిష్కారం కాదని ప్రతి ఒక్కరూ ఆలోచించుకోవాలి. యశ్వంత్ ఆత్మహత్య ప్రతి ఉద్యోగికి ఓ కనిప్పు కావాలి.మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చస్తున్నారు..

# ప్రకృతి వ్యవసాయంతో తక్కువ ఖర్చుతో అధిక ప్రయోజనాలు






**చంద్రుగొండ/జూలూరుపాడు సెప్టెంబర్ 15 (భద్రాద్రి న్యూస్)ప్రతినిధి:** చంద్రుగొండ మండలం పోకలగూడెం క్లస్టర్‌లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బెండాలపాడు, రావికంపాడు గ్రామాల రైతులకు జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొర్రా లలిత, దిశ కమిటీ సభ్యుడు బొర్రా సురేష్, ఉప సర్పంచ్ బానోత్ బాలు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వీసం శ్రావణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగుమందులపై ఆధారపడకుండా సహజ వనరులతో పంటలు సాగు చేయడం ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ఆవు పేడ, ఆవు మూత్రం, జీవామృతం, ఘన జీవామృతం వంటి సహజ వనరులను వినియోగించాలని సూచించారు. పంట అవశేషాలను కాల్చకుండా పొలంలోనే వినియోగించడం, అంతర పంటలు సాగు చేయడం, పంట మార్పిడి, నేలలో తేమను కాపాడటం వంటి పద్ధతులతో సాగు ఖర్చులను తగ్గించుకోవచ్చని వివరించారు. రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని తొలుత కొంత భూమిలో ప్రయోగాత్మకంగా చేపట్టి, అనుభవం ఆధారంగా విస్తరించాలని అధికారులు సూచించారు. అనంతరం రైతులు అడిగిన సందేహాలను అధికారులు నివృత్తి చేసి, పలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట డివిజన్ ప్రకృతి వ్యవసాయ మిషన్ అధికారులు, చంద్రుగొండ వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారులు, క్లస్టర్ పరిధిలోని రైతులు, మహిళా రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన విద్యార్థులకు ధర్మధారా ట్రస్ట్ ఆపన్న హస్తం

### – గడ్డిగుట్ట జీపీఎస్ పాఠశాలలో స్కూల్ బ్యాగులు, స్టేషనరీ పంపిణీ






**లక్ష్మీదేవిపల్లి, సెప్టెంబర్ 15 (భద్రాద్రి న్యూస్):** లక్ష్మీదేవిపల్లి మండలంలోని మారుమూల గ్రామమైన గడ్డిగుట్ట జీపీఎస్ పాఠశాల విద్యార్థులకు ధర్మధారా చారిటబుల్ ట్రస్ట్ అండగా నిలిచింది. రూప్లా నాయక్ అధ్యక్షతన, బటర్‌ఫ్లై చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ధర్మధారా చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహకారంతో విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగులు, నోట్‌బుక్స్, ఇతర స్టేషనరీ సామగ్రిని పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ సంతోష్ నాయక్, కాంప్లెక్స్ హెచ్ఎం బి. శంకర్ చేతుల మీదుగా విద్యార్థులకు బ్యాగులతో పాటు విద్యా సంవత్సరానికి అవసరమైన నోట్‌బుక్స్, ఇతర విద్యా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మారుమూల ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులను ప్రోత్సహించడం, వారిలో చదువుపై ఆసక్తిని పెంపొందించడం ఎంతో అభినందనీయమన్నారు. విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందిస్తూ ధర్మధారా చారిటబుల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. పేద విద్యార్థుల చదువుకు అండగా నిలవడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని, విద్యార్థుల భవిష్యత్తు కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ధర్మధారా చారిటబుల్ ట్రస్ట్ కో–ఆర్డినేటర్ రూప్లా నాయక్‌ను ఘనంగా సన్మానించారు. పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి అందించినందుకు పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు ధర్మధారా చారిటబుల్ ట్రస్ట్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ సి ఆర్ పి బి. రమేష్, ఉపసర్పంచ్, ప్రధానోపాధ్యాయురాలు బేబీ రాణి, ఉపాధ్యాయులు, సేవాలాల్ సేన రాష్ట్ర నాయకులు లావుడ్యా ప్రసాద్, మాజీ స్కూల్ కమిటీ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

## మేదర బస్తీలో వినాయక చవితి వేడుకలు





**కొత్తగూడెం అర్బన్ ,సెప్టెంబర్ 15 (భద్రాద్రి న్యూస్):** పట్టణ పరిధిలోని మేదర బస్తీలో ప్రముఖ వ్యాపారస్తులు ఆయిత ప్రకాష్, విజయలక్ష్మి స్వగృహంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరికీ ఆరోగ్యం, ఆనందం కలగాలని ప్రార్థించారు. అలాగే వసుంధర షాపింగ్ మాల్ అధినేత తాటిపల్లి శంకర్ బాబు ఆధ్వర్యంలో మిత్రబృందం పల్లపోతు వాసు, బొడ్ల మహేష్, నాగేశ్వరరావు, గునిపాటి ఆనంద్, ఆయిత ప్రకాష్ లు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసి, గణేష్ నవరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు.

## వాసవీక్లబ్ ఆధ్వర్యంలో మట్టి గణేశ విగ్రహాలు పంపిణీ




**మణుగూరు, సెప్టెంబర్ 15 (భద్రాద్రి న్యూస్):** మండల వాసవీక్లబ్, ఆర్యవైశ్య సంఘం సంయుక్త ఆధ్వర్యంలో వినాయక చవితిని పురస్కరించుకుని ప్రజలకు మట్టి గణేశ్ విగ్రహాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దోసపాటి నాగేశ్వరరావు ప్రారంభించగా, ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వాసవీక్లబ్ అధ్యక్షుడు శ్యామ్ మాట్లాడుతూ... ప్రతి ఏటా పర్యావరణాన్ని పరిరక్షించాలని మట్టి గణపయ్య మణుగూరు ప్రజలకు విఘ్నాలు తొలిగించి విజయాలు చేకూర్చాలని గణేశ్ విగ్రహాలు పంపిణీ చేయడం ఆనవాయితీగా మారిందన్నారు. దశాబ్దం నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్విరామంగా కొనసాగిస్తున్నామన్నారు. ఈ ఏడాది 800 మట్టి విగ్రహాలు, వ్రత కథ పుస్తకాలు అందజేసి ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ వినియోగం నిరోధించడంలో పర్యావరణ పరిరక్షణలో మా వంతు కృషి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వాసవీక్లబ్, ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు దోసపాటి క్రాంతి, ఐపిసీ లు కడవెండి విశ్వనాథ గుప్తా, బండారు నర్సింహారావు, చిత్తలూరి రమేశ్ బాబు, చిట్టూరి శేషు కుమార్, దుగ్గి సతీష్, సంకా రాధా శ్యాంగుప్తా, బొడ్డు పుల్లారావు, గౌరీశంకర్, సుగ్గల సూర్యం, బ్రహ్మాజీ తదితరులు ఉన్నారు.

# తెలంగాణలో బాల్ బ్యాడ్మింటన్‌కు ‘గోల్డెన్ రన్’!

- ఐక్యతే బలం....సమష్టి కృషితో బాల్ బ్యాడ్మింటన్‌కు కొత్త ఊపిరి
- ప్రభుత్వ ప్రోత్సాహం.. సంఘాల సమష్టి కృషి..
- పి.ఈ.టిలు,పి.డిల అంకితభావంతో క్రీడకు మరింత జోష్
- “క్రీడలు మెరుగైన భవిష్యత్తును నిర్మిస్తాయి.”
- తెలంగాణ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రెండు సంవత్సరాల ప్రగతి
- ప్రతి పాఠశాలకు, ప్రతి జిల్లాకు క్రీడను తీసుకెళ్లడమే లక్ష్యం
- తెలంగాణ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ వి.వి. రమణ






**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (భద్రాద్రి న్యూస్):** తెలంగాణ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఐక్యత, సమష్టి కృషి, అభివృద్ధి లక్ష్యాలతో విజయవంతంగా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకుంది. బిబిఎఫ్ఐ ముఖ్య సలహాదారు ఎం. శ్రీనివాసరావు నాయకత్వం లో, అసోసియేషన్ అధ్యక్షులు డా. బంగారీ స్వామి విలువైన మార్గదర్శకత్వం, సహకారంతో పాటు రాష్ట్ర, జిల్లా సంఘాల కార్యవర్గ సభ్యుల అంకితభావంతో ఈ ప్రగతి సాధ్యమైందని జనరల్ సెక్రటరీ వి.వి. రమణ తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా బాల్ బ్యాడ్మింటన్ క్రీడ అభివృద్ధి, ప్రోత్సాహం కోసం ఐక్యతతో నిరంతరం కృషి చేస్తున్న రాష్ట్ర, జిల్లా సంఘాల ప్రతినిధులు, కార్యవర్గ సభ్యులను ఆయన అభినందించారు. అలాగే రాష్ట్రంలోని పాఠశాలల్లో బాల్ బ్యాడ్మింటన్‌ను ప్రోత్సహిస్తూ విద్యార్థులను క్రీడల వైపు మళ్లించేందుకు అవిశ్రాంతంగా కృషి చేస్తున్న శారీరక విద్యా ఉపాధ్యాయులు ( పి ఈ టి ), ఫిజికల్ డైరెక్టర్లు ( పి డి ) సేవలను ప్రత్యేకంగా ప్రశంసించారు. మరింత మంది విద్యార్థులు ఈ క్రీడలో పాల్గొనేలా చేయడంలో వారి అంకితభావం కీలకమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కప్‌తో క్రీడలకు ప్రోత్సాహం తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యంగా ముఖ్యమంత్రి కప్ ద్వారా అందిస్తున్న విలువైన మద్దతు, ప్రోత్సాహానికి బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ తరపున కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా క్రీడలను ప్రోత్సహించడంతో పాటు యువ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీయడానికి ముఖ్యమంత్రి కప్ ఒక మంచి వేదికగా నిలుస్తోందన్నారు.

రానున్న రోజుల్లో ఇదే ఐక్యత, సహకారం, జట్టు స్ఫూర్తితో తెలంగాణలోని ప్రతి పాఠశాలకు, ప్రతి జిల్లాకు బాల్ బ్యాడ్మింటన్‌ను తీసుకెళ్లేందుకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. “మరింత మంది క్రీడాకారులు.. బలమైన తెలంగాణ” అనే లక్ష్యంతో ముందుకు సాగుదామని వి.వి. రమణ పేర్కొన్నారు. అసోసియేషన్‌కు అందిస్తున్న ప్రతి ఒక్కరి అమూల్యమైన మద్దతుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.


వి.వి. రమణ





# ఇసుక లారీల దూకుడుకు అడ్డుకట్ట ఎప్పుడు?

- అతివేగం.. అధ్వాన్న రహదారులు.. ప్రజల ప్రాణాలతో చెలగాటమా?
- కాంట్రాక్టర్ల లాభాల కోసం ప్రయాణికుల ప్రాణాలను పణంగా పెడతారా?
- ప్రమాదం జరిగిన తర్వాత కాదు.. ముందే చర్యలు తీసుకోవాలి: ఇరప రాజు దొర

**చర్ల , సెప్టెంబర్ 15 (భద్రాద్రి న్యూస్):** చర్ల. భద్రాచలం పరిధిలో ఇసుక లారీల దూకుడు, అధ్వాన్న రహదారులు ప్రజలకు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. భారీ ఇసుక లారీలు అతివేగంగా రాకపోకలు సాగిస్తుండటంతో ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, కార్లు, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఇరప రాజు దొర ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే గుంతలు, గతుకులతో అధ్వాన్నంగా మారిన రహదారులపై భారీ ఇసుక లారీల నిరంతర రాకపోకలు పరిస్థితిని మరింత ప్రమాదకరంగా మారుస్తున్నాయని అన్నారు. గ్రామాల నుంచి మండల కేంద్రాలు, పట్టణాలకు నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు ఇసుక లారీల మధ్య ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు.

**లాభాల కోసం ప్రజల ప్రాణాలా?**

ఇసుక రవాణా ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతున్నప్పటికీ, ఆ పేరుతో ప్రజల భద్రతను విస్మరించడం ఎంతవరకు సమంజసమని ఇరప రాజు దొర ప్రశ్నించారు. ఇసుక కాంట్రాక్టర్ల వ్యాపార ప్రయోజనాలు ముఖ్యమా? లేక రహదారులపై ప్రయాణించే ప్రజల ప్రాణాలు ముఖ్యమా? అని అధికారులను నిలదీశారు. భారీ వాహనాల నిరంతర రాకపోకల కారణంగా రహదారులు మరింత దెబ్బతింటున్నాయని, గుంతలు పెరగడంతో ప్రమాదాల ముప్పు అధికమవుతోందని అన్నారు. లారీలు వేగంగా దూసుకెళ్లే సమయంలో దుమ్ము భారీగా లేచి వెనుక వచ్చే వాహనదారులకు ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించని పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

**అధికారుల కళ్లకు కనిపించడం లేదా?**

ఇసుక లారీల వేగం, రాకపోకలు, ఓవర్‌లోడింగ్, రవాణా నిబంధనల అమలుపై సంబంధిత శాఖలు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాల్సి ఉన్నప్పటికీ.. ప్రమాదం జరిగిన తర్వాతే అధికారులు మేల్కొనే పరిస్థితి ఎందుకు? అని ఆయన ప్రశ్నించారు. ఇసుక లారీలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అతివేగంగా నడిపే వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖను డిమాండ్ చేశారు. అవసరమైన ప్రాంతాల్లో స్పీడ్ గన్స్ ఏర్పాటు చేయడంతో పాటు వాహన తనిఖీలు, చెక్‌పోస్టులు, రాత్రివేళ ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై కేసులు నమోదు చేసి, పునరావృతంగా తప్పిదాలకు పాల్పడే వాహనాలపై మరింత కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

**రోడ్లు బాగు చేయకుండా భారీ వాహనాలకు అనుమతులా?**

ఆర్అండ్‌బీ శాఖ రహదారుల పరిస్థితిపై తక్షణమే సమీక్ష నిర్వహించాలని ఇరప రాజు దొర కోరారు. భారీ ఇసుక వాహనాల రాకపోకలను తట్టుకునే సామర్థ్యం ఆయా రహదారులకు ఉందా? లేదా? అనే అంశాన్ని అధికారులు పరిశీలించాలని అన్నారు. గుంతలు, దెబ్బతిన్న కల్వర్టులు, అధ్వాన్నంగా మారిన రహదారులకు అత్యవసర మరమ్మతులు చేపట్టాలని, అవసరమైన ప్రాంతాల్లో రోడ్లను పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రజలు నిత్యం వినియోగించే రహదారులను పట్టించుకోకుండా ఇసుక రవాణాకు మాత్రమే ప్రాధాన్యం ఇవ్వడం సరికాదన్నారు.

**ప్రమాదం కోసం ఎదురుచూస్తున్నారా?**



ఇసుక లారీల దూకుడుకు ఇప్పటికైనా అడ్డుకట్ట వేయకపోతే భవిష్యత్తులో భారీ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఇరప రాజు దొర హెచ్చరించారు. ఒక ప్రాణం పోయిన తర్వాత నష్టపరిహారం ప్రకటించడం కంటే.. ఒక్క ప్రాణం కూడా పోకుండా ముందస్తు చర్యలు తీసుకోవడమే ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రజలు ప్రతిరోజూ ఉపయోగించే రహదారులు ఎవరి వ్యక్తిగత ఆస్తి కాదని, అవి ప్రజల హక్కు అని అన్నారు. ఇసుక రవాణా కోసం రహదారులను వినియోగిస్తున్నప్పుడు అదే స్థాయిలో ప్రజల భద్రతకు కూడా ప్రాధాన్యం ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. పోలీసు, ఆర్అండ్‌బీ, రవాణా, రెవెన్యూ శాఖలు సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ఇసుక లారీల వేగానికి అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. “ప్రమాదం జరిగిన తర్వాత పరామర్శలు, తనిఖీలు చేయడం కాదు.. ప్రమాదం జరగకముందే అడ్డుకోవాలి. ఇసుక కాంట్రాక్టర్ల లాభాల కంటే ప్రజల ప్రాణాలే ముఖ్యం. రహదారులపై ప్రయాణించే ప్రతి ఒక్కరి భద్రతకు ప్రభుత్వం హామీ ఇవ్వాలి. అధికారులు ఇకనైనా మేల్కొని కఠిన చర్యలు తీసుకోవాలి” అని ఇరప రాజు దొర ఘాటుగా డిమాండ్ చేశారు.

www.bhadradrinews.com
భద్రాద్రి న్యూస్
Bhadradrinews Telugu Daily
తెలుగు దినపత్రిక
Follow :
@bhadradrinews
బుధవారం
16 , సెప్టెంబర్ , 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం,
భద్రాద్రి కొత్తగూడెం

# ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో ఘనంగా వినాయక చవితి పూజలు





**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 15 (భద్రాద్రి న్యూస్):** ఖమ్మం ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ విఘ్నేశ్వర స్వామివారి ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ప్రాంగణంలో వినాయక విగ్రహాన్ని అందంగా అలంకరించి, వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి హారతి సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి సోమా నరసింహారావు దంపతులు, సహాయ కార్యదర్శి బాదే రమేష్ (రవి) దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అలాగే కురువెళ్ళ ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షులు బత్తిని నరసింహారావు, సెంట్రల్ ఈసీ సభ్యులు మాటేటి కిరణ్ కుమార్, రాయపూడి రవికుమార్, పోట్ల రామనాథం, వంగవీటి హరీష్ కుమార్, దిగుమతి శాఖ అధ్యక్షులు వడ్డె వెంకటేశ్వర్లు, జనరల్ కార్యవర్గ సభ్యులు సారిక పాపారావు, మల్లెల అప్పారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఛాంబర్ ప్రతినిధులు మాట్లాడుతూ విఘ్నాలను తొలగించి విజయాలను ప్రసాదించే విఘ్నేశ్వర స్వామివారి ఆశీస్సులతో ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, అభివృద్ధి కలగాలని ఆకాంక్షించారు. వ్యాపార రంగంలో ఉన్న ప్రతి ఒక్కరికీ మంచి వ్యాపారం, ఆర్థిక అభివృద్ధి చేకూరాలని, కుటుంబాల్లో శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని గణపతి స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.
వినాయక చవితి సందర్భంగా ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు, వ్యాపారవేత్తలు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

# త్రివేణిలో హిందీ భాషా సౌరభం

**– హిందీ ప్రాధాన్యతను చాటుతూ ఘనంగా హిందీ దివస్ వేడుకలు**



**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 14( భద్రాద్రి న్యూస్ ):** హిందీ దివస్‌ను పురస్కరించుకుని త్రివేణి పాఠశాల, ఖమ్మం శాఖలో హిందీ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు హిందీ భాష గొప్పతనాన్ని తెలియజేస్తూ ప్రసంగాలు, కవితలు, దేశభక్తి గీతాలు ఆలపించారు. హిందీ భాష ప్రాముఖ్యత, భారతీయ సంస్కృతితో దాని అనుబంధాన్ని వివరిస్తూ పలు అంశాలను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డా. గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ, హిందీ భారతదేశంలోని భిన్న ప్రాంతాల ప్రజలను అనుసంధానించే ముఖ్యమైన భాష అని అన్నారు. విద్యార్థులు హిందీ భాషను కేవలం ఒక సబ్జెక్టుగా కాకుండా, దేశంలోని భిన్న సంస్కృతులను కలిపే భాషగా అర్థం చేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ శ్రీ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, భాష మన ఆలోచనలకు, భావాలకు వారధిగా నిలుస్తుందని అన్నారు. హిందీ భాషపై విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించి, మాట్లాడటం, చదవడం, రాయడంలో నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ప్రతి భాషను గౌరవిస్తూ, భాషా వైవిధ్యంలో భారతీయ ఏకత్వాన్ని చాటాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సి.ఆర్.ఓ కాట్రగడ్డ మురళికృష్ణ, వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్‌పోర్ట్ ఇంచార్జ్ సందీప్, హిందీ ఉపాధ్యాయులు, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వ్యభిచార ముఠా నిర్వాహకుడిపై పీడీ యాక్ట్ ప్రయోగం

**– పోలీస్ కమిషనర్**



**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 15 ( భద్రాద్రి న్యూస్):** ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో మహిళలను వ్యభిచారంలోకి దింపి ఆర్థిక లాభాలు పొందుతున్న బత్తుల బాలకృష్ణ పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పీడీ యాక్ట్ కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం,చిరుమర్రి గ్రామానికి చెందిన నిందితుడు బత్తుల బాలకృష్ణ, 30సం,ఆర్థిక లాభాల కోసం జిల్లాలో వ్యభిచార గృహాలను నిర్వహిస్తూ,మహిళలను వ్యభిచారంలోకి తీసుకువచ్చే అసాంఘిక, అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. నిందితుడు బాలకృష్ణపై ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఖమ్మం టూ టౌన్, త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లలో, అనైతిక రవాణా, వ్యభిచార నిరోధక చట్టం కింద కేసులు నమోదయ్యాయి. 2026 జనవరి 6న విశ్వసనీయ సమాచారం మేరకు ఖమ్మం గాంధీచౌక్‌లోని ఓ లాడ్జిలోని గది ని పోలీసులు దాడి చేశారు. వ్యభిచార కార్యకలాపాల కోసం లాడ్జిలో గది పొందేందుకు అధిక మొత్తంలో డబ్బు చెల్లించినట్లు తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు బాలకృష్ణ, మెరెడ్డి సత్యవతి, లాడ్జి మేనేజర్ అలకుంట్ల శ్రీకాంత్ తో కలిసి కుట్రపూరితంగా వ్యవహరించినట్లు తెలిపారు. కాకినాడ కు చెందిన మహిళను ఆర్థిక ఇబ్బందులను ఆసరాగా చేసుకొని వ్యభిచారంలోకి తీసుకువచ్చినట్లు, ఖమ్మంకు తరలించి లాడ్జి గదిలో ఉంచి, కస్టమర్ల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు కేసు దర్యాప్తులో వెల్లడైంది. నిందితుడి నేర ప్రవర్తనను నిరోధించేందుకు శాంతిభద్రతల పరిరక్షణ, ప్రమాదకర కార్యకలాపాల నిరోధక చట్టం, 1986 (పీడీ యాక్ట్) సెక్షన్ 3(2) కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేసి చంచల్‌గూడ సెంట్రల్ జైలు కు తరలించారు.

# బొమ్మా కళాశాలలో ఘనంగా ఇంజనీరింగ్ డే వేడుకలు



**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 15( భద్రాద్రి న్యూస్):**-స్థానిక బొమ్మా ఇంజనీరింగ్ కళాశాలలో 'ఇంజనీర్స్ డే' వేడుకలను మంగళవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ?మోక్షగుండం విశ్వేశ్వరయ్య 165వ జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ బొమ్మా రాజేశ్వరరావు మాట్లాడుతూ... సర్ ఎం. విశ్వేశ్వరయ్య దేశానికి అందించిన అత్యున్నత సేవలను గుర్తించే భారత ప్రభుత్వం ఆయనకు 'భారతరత్న' అవార్డును ఇచ్చి గౌరవించిందని గుర్తుచేశారు. విద్యార్థులందరూ విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకుని, ఆయన బాటలోనే నడవాలని సూచించారు. భవిష్యత్తులో బొమ్మా కళాశాల విద్యార్థులు సమాజంలో ఆదర్శప్రాయంగా నిలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ?ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జా. మురళీకృష్ణ, వివిధ విభాగాల అధిపతులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలి..

- పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలి
- ఇసుక లారీల దూకుడుకు అడ్డుకట్ట వేయాలి..
తాలిపేరు నీటితో కాలువలు నింపి రైతులకు సాగునీరు అందించాలి
- కేటీఆర్ పిలుపుతో వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై పోరాటాలకు కార్యాచరణ





**చర్ల, సెప్టెంబర్ 15 (భద్రాద్రి న్యూస్):** చర్ల మండలంలో బీఆర్ఎస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేస్తూ, ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహించాలని భద్రాచలం నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ రావులపల్లి రాంప్రసాద్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు స్థానిక సమస్యలపై ప్రజల తరఫున గళమెత్తాలని సూచించారు. మంగళవారం చర్ల మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మండల కన్వీనర్ దొడ్డి తాతారావు అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా నియోజకవర్గ ఇన్‌చార్జ్ రావులపల్లి రాంప్రసాద్, మాజీ ఇన్‌చార్జ్ మనే రామకృష్ణ హాజరై పార్టీ భవిష్యత్ కార్యాచరణపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. గ్రామస్థాయి నుంచి పార్టీని పటిష్టం చేయడంతో పాటు ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమాలు చేపట్టాలని నాయకులు సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై పోరాడినప్పుడే పార్టీకి మరింత ప్రజాదరణ లభిస్తుందని పేర్కొన్నారు.

**వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై సమరం**

బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై నిరసన కార్యక్రమాలను మరింత ఉధృతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, ప్రకటించిన వాగ్దానాల అమలులో ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ ఇప్పటికే మండలంలో బీఆర్ఎస్ శ్రేణులు చేపట్టిన నిరసనలు, ప్రజా కార్యక్రమాలను నాయకులు అభినందించారు. ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

**ఇసుక లారీల దూకుడుపై రాజీలేని పోరాటం**

భద్రాచలం, దుమ్ముగూడెం పరిధిలో ఇసుక లారీల కారణంగా జరుగుతున్న ప్రమాదాలపై సమావేశంలో తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. ఇసుక రవాణా పేరుతో అతివేగంగా, అధిక లోడుతో దూసుకెళ్తున్న లారీలతో ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం సరికాదని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి ఇసుక రవాణాకు అనుమతులు ఇవ్వడం ఎంతమాత్రం సమర్థనీయం కాదని, ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కాకుండా ముందుగానే కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇసుక లారీల వేగం, ఓవర్‌లోడ్, రహదారుల అధ్వాన్న పరిస్థితులపై నిరంతరం పోరాటం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

**తాలిపేరు నీటితో కాలువలు నింపాలి**

తాలిపేరు ప్రాజెక్టు నీటిని కాలువలకు అందించి రైతులకు సాగునీటి సౌకర్యం కల్పించాలని నాయకులు డిమాండ్ చేశారు. రైతుల సాగునీటి అవసరాలను పట్టించుకోకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా భద్రాచలం నుంచి చర్ల వరకు రహదారి పరిస్థితిని మెరుగుపరిచి, పెరుగుతున్న ఇసుక లారీల రాకపోకలకు అనుగుణంగా రహదారి అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. మండలంలోని ప్రతి పంచాయతీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం కార్యాచరణ రూపొందించాలని నాయకులకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లో ఎండగడుతూ.. బీఆర్ఎస్ హయాంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ.. స్థానిక సమస్యలపై ప్రజల తరఫున గట్టిగా పోరాడాలని నాయకులు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సమావేశంలో మండల పార్టీ కో-కన్వీనర్ ఐనవోలు పవన్, సీనియర్ నాయకులు ఎస్.డి. అజీజ్, యడ్ల రామదాసు, కాకి అనిల్, కుప్పాల నిరంజన్, తోటపల్లి మాధవరావు, గోరింట్ల వెంకటేశ్వరరావు, ఎన్నమూరి సృజన్, గాదంశెట్టి కిషోర్, పాసిగంటి సంతోష్, ఎస్కే షాదిక్, కారం కన్నారావు, అలవాల కృష్ణ, కనుక వీరభద్రం, వేములవాడ కృష్ణతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 10 శాతం ఎస్టీ రిజర్వేషన్‌కు గుర్తుగా కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

- తండాలను గ్రామపంచాయతీలుగా మార్చి గిరిజనుల ఆత్మగౌరవాన్ని పెంచిన నాయకుడు కేసీఆర్
- కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



**ఖమ్మం ప్రతినిధి,సెప్టెంబర్ 15 (భద్రాద్రి న్యూస్ ):** తెలంగాణలో గిరిజనులకు 6 శాతం నుంచి 10 శాతానికి ఎస్టీ రిజర్వేషన్ పెంచి అమలు చేసిన చారిత్రాత్మక నిర్ణయాన్ని స్మరించుకుంటూ, ఖమ్మంలో తెలంగాణ భవన్, జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం లో వైరా ఎమ్మెల్యే చంద్రావతి అధ్యక్షతన గిరిజన నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులతో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైరా మాజీ ఎమ్మెల్యే డా. బానోత్ చంద్రావతి మాట్లాడుతూ, గిరిజనుల దశాబ్దాల ఆకాంక్షను గుర్తించి 10 శాతం ఎస్టీ రిజర్వేషన్ అమలు చేయడంతో పాటు, తండాలను గ్రామపంచాయతీలుగా మార్చి గిరిజనులకు స్వయం పాలన, రాజకీయ ప్రాతినిధ్యం, ఆత్మగౌరవం కల్పించిన ఘనత కేసీఆర్ గారిదేనని పేర్కొన్నారు. "10 శాతం రిజర్వేషన్ అనేది కేవలం శాతం పెంపు కాదు. గిరిజన యువత విద్య, ఉద్యోగాలు, భవిష్యత్తుకు ఇచ్చిన హక్కు. తండాలను గ్రామపంచాయతీలుగా మార్చడం గిరిజనుల స్వయం పాలనకు వేసిన బలమైన పునాది" అని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో గిరిజన విద్యకు ప్రాధాన్యత, గురుకులాల విస్తరణ, తండాలు మరియు గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, పోడు భూముల సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలను గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో గిరిజనులకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని నాయకులు విమర్శించారు. గిరిజన యువతకు ఉద్యోగ అవకాశాలు, విద్యలో రిజర్వేషన్ ప్రయోజనాల సమర్థ అమలు, పోడు భూముల సమస్యలు, తండాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వసంత -- సర్పంచ్, భగత్‌వీడు తాండా -- బదావత్ అనుషా, గాయిగొల్లపల్లి -- బుగ్లోత్ మాధవి, మంగల్ తాండా -- బాణోత్ దిక్షం నాయక్, గుర్వావత్ తాండా -- జర్పులా బాలాజీ, బోడా మంచా నాయక్ -- మాజీ సర్పంచ్/ఎంపీటీసీ, అమర్ సింగ్ -- మాజీ జెడ్పీటీసీ, బోడా వీరకుమార్ -- మాజీ సర్పంచ్, భుక్యా సాయి -- స్టూడెంట్ ఆర్గనైజేషన్, తదితరులు పాల్గొన్నారు. అలాగే ధరావత్ శంకర్, బాణోత్ కొండా, బాణోత్ కిషన్, లకావత్ గిరిబాబు, మంచా నాయక్, భుక్యా కృష్ణా, బాణోత్ కిషన్ నాయక్, బాణోత్ బాలాజీ నాయక్, బాణోత్ భిక్షం, బాణోత్ రెడ్డియా నాయక్, మాళోత్ నాగేశ్వర్ రావు, శంకర్ నాయక్, జర్పులా వీరన్న, తేజవత్ రామ్మూర్తి తదితరులు మాట్లాడారు. వారు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను గిరిజన ప్రజల్లోకి తీసుకెళ్లాలని, గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ కల్పించడం, తండాలను గ్రామపంచాయతీలుగా మార్చడం వంటి చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్న కేసీఆర్ గారికి కృతజ్ఞతలు తెలియజేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా సెప్టెంబర్ 17న నిర్వహించనున్న కార్యక్రమాల్లో గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొని, 10 శాతం ఎస్టీ రిజర్వేషన్ సాధనకు ఉన్న చారిత్రాత్మక ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయాలని కోరారు. "ఒక ప్రభుత్వాన్ని గిరిజనులు మాటలతో గుర్తుంచుకోరు. తమకు వచ్చిన హక్కులు, అవకాశాలు, ఆత్మగౌరవంతో గుర్తుంచుకుంటారు. ఆ విషయంలో కేసీఆర్ గారి నిర్ణయాలు తెలంగాణ గిరిజన చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తాయి" అని పేర్కొన్నారు. గిరిజనులకు ఇప్పటికే సాధించిన హక్కులను కాపాడటంతో పాటు, ఇంకా పరిష్కారం కావాల్సిన సమస్యల కోసం బీఆర్ఎస్ గిరిజన నాయకత్వం నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. "గిరిజనులకు సాధించిన హక్కులను కాపాడటం, ఇంకా రావాల్సిన హక్కులను సాధించడం మా బాధ్యత. గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవం విషయంలో రాజీ ఉండదు" అని స్పష్టం చేశారు.

# గంజాయి సరఫరా, సైబర్ నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాలు నివారణపై ప్రత్యేక దృష్టి పట్టాలి

**- నేర సమీక్షా సమావేశం లో పోలీస్ కమిషనర్ సునీల్ దత్**





**ఖమ్మం ప్రతినిధి ,సెప్టెంబర్ 15( భద్రాద్రి న్యూస్):-** గంజాయి వినియోగించే అవకాశం ఉన్న నిర్మానుష ప్రాంతాలు, శివారు ప్రాంతాలు, ఖాళీ ప్రదేశాలు, పాడుబడిన భవనాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పోలీస్ అధికారులకు ఆదేశించారు. పోలీస్ అధికారులతో పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. నిర్మానుష ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ గంజాయి వినియోగం, విక్రయాలు, సరఫరాకు పాల్పడే వారిని గుర్తించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గంజాయి సరఫరా చేస్తున్న ప్రధాన వ్యక్తులను గుర్తించి, వారి నెట్‌వర్క్‌ను ఛేదించడంతో పాటు వినియోగదారులను కూడా గుర్తించి చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు నిరంతర నిఘా, తనిఖీలు, అవగాహన కార్యక్రమాలను ముమ్మరం చేయాలని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు. సైబర్ నేరాల నియంత్రణకు సమర్థవంతమైన వ్యూహంతో ముందుకు వెళ్లాలని,
సైబర్ నేరాలకు పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించి, నేరాల వెనుక ఉన్న మొత్తం నెట్‌వర్క్‌ను ఛేదించేలా దర్యాప్తు చేపట్టాలని సూచించారు. సైబర్ మోసాలకు గురైన బాధితుల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి, బ్యాంకులు--ఆర్థిక సంస్థలతో సమన్వయం చేసుకుంటూ మోసపోయిన నగదును వీలైనంత త్వరగా ఫ్రీజ్ చేయించి బాధితులకు తిరిగి అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డిజిటల్ అరెస్టులు, పెట్టుబడి మోసాలు, ఓటీపీ మోసాలు, ఫేక్ లింకులు, సోషల్ మీడియా మోసాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న బ్లాక్ స్పాట్లను గుర్తించి, ప్రమాదాలకు గల కారణాలను విశ్లేషించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, రాంగ్‌రూట్ డ్రైవింగ్, హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ వినియోగించకపోవడం వంటి ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రధాన రహదారులు, జంక్షన్లు, ప్రమాదకర మలుపుల వద్ద నిరంతర నిఘా, వాహన తనిఖీలు చేపట్టాలని, ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోక్సో కేసుల్లో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి, ఆధారాలను పకడ్బందీగా సేకరించి, నిందితులకు శిక్ష పడే విధంగా కోర్టు కేసులను సమర్థవంతంగా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. మహిళలు, బాలికలపై నేరాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ఫిర్యాదులపై వెంటనే స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. దర్యాప్తు పూర్తయిన కేసుల్లో పెండింగ్‌లో ఉన్న ఛార్జ్‌షీట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆలస్యం చేయకుండా వెంటనే పూర్తి చేసి కోర్టుల్లో దాఖలు చేయాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు. కేసుల దర్యాప్తులో జాప్యం జరగకుండా ప్రతి కేసును నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేయాలని, పెండింగ్ కేసులను అధికారులు స్వయంగా సమీక్షిస్తూ దర్యాప్తు పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. నేరస్తులకు శిక్ష పడేలా పకడ్బందీ దర్యాప్తు, బలమైన ఆధారాల సేకరణ, సమర్థవంతమైన ప్రాసిక్యూషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ రామానుజం, ఏసీపీ రమణమూర్తి, సాంబరాజు, ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యంగా అధికారులు పనిచేయాలి

- **కలెక్టర్ అంకిత్**
- **భూ రికార్డుల్లో పూర్తి స్పష్టత తీసుకురావాలి**
- **ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలి**
- **యంగ్ ఇండియా పాఠశాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి**
- **విధుల్లో నిర్లక్ష్యంపై ఆర్ఐ, ఎంపీడీవోపై చర్యలకు ఆదేశాలు**

**భద్రాచలం, సెప్టెంబర్ 15( భద్రాద్రి న్యూస్):-** దుమ్ముగూడెం మండలం మల్కానపల్లి, చిన్నబండిరేవు గ్రామాల్లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు, సేవలు సకాలంలో అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయడంతో పాటు, పరస్పర సమన్వయంతో పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

మల్కానపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీ సర్వే పనులను కలెక్టర్ అంకిత్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి పరిశీలించారు. సుమారు 2 కిలోమీటర్లు అటవీ ప్రాంతం గుండా నడిచి క్షేత్రస్థాయిలో సర్వే పనుల పురోగతిని పరిశీలించారు. గ్రామ సరిహద్దులు, భూముల విస్తీర్ణం, ఎంజాయర్ల వివరాలు, పాత రెవెన్యూ రికార్డులు, క్షేత్రస్థాయి కొలతలు, రీ సర్వే పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సరిహద్దుల నిర్ధారణ పూర్తయినప్పటికీ రీ సర్వే ప్రక్రియ పెండింగ్‌లో ఉండటంపై కలెక్టర్ సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పాత రికార్డులు, మ్యాప్‌లు, క్షేత్రస్థాయి కొలతలను సమన్వయం చేసి భూ రికార్డుల్లో పూర్తి స్పష్టత తీసుకురావాలని సూచించారు.

సర్వే పరిధిలో సుమారు 120 మంది ఎంజాయర్లు ఉన్నట్లు అధికారులు వివరించగా, వారి సంఖ్య, భూ వివరాలు, పట్టాదారు పాసుపుస్తకాల పరిస్థితి, రీ సర్వే పురోగతిపై కలెక్టర్ సంబంధిత ఆర్ఐను ప్రశ్నించారు. అయితే ఆర్ఐ సరైన వివరాలను, ప్రాథమిక సమాచారాన్ని స్పష్టంగా అందించలేకపోవడంతో కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. భూ రికార్డులు, సర్వే వివరాలపై క్షేత్రస్థాయి అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సంబంధిత ఆర్ఐపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అటవీ ప్రాంతాలకు సంబంధించిన పాత సర్వే రికార్డులు, సరిహద్దుల వివరాలను అటవీ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని రీ సర్వేను వేగవంతం చేయాలని సూచించారు.

దుమ్ముగూడెం మండలంలో మొత్తం 8 గ్రామాల్లో భూ రీ సర్వే చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు 5 గ్రామాల సరిహద్దుల నిర్ధారణ పూర్తికాగా, 3 గ్రామాల్లో గ్రామసభలు పూర్తయ్యాయని, లింగాపురం పరిధిలో సుమారు 250 ఎకరాల్లో రీ సర్వే జరుగుతున్నట్లు వివరించారు. మిగిలిన పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేసేలా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు.

మల్కానపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించి, లబ్ధిదారుల వారీగా నిర్మాణ పురోగతిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో గుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాల సంఖ్య, వారికి నిర్వహించిన సర్వే వివరాలను ఎంపీడీవో వివేక్ చంద్రను అడిగి తెలుసుకునే ప్రయత్నంలో సరైన సమాచారం అందించలేకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం, సరైన సమాచారం అందించకపోవడంపై ఎంపీడీవోకు చార్జ్‌మెమో జారీ చేసి, 24 గంటల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ప్రయోజనం అందేలా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని నిరంతరం పర్యవేక్షించి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

చిన్నబండిరేవు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. పాఠశాల భవనాలు, తరగతి గదులు, వసతి గృహాలు, ఇతర మౌలిక వసతుల నిర్మాణ పురోగతిని పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వసతి, భోజనం, క్రీడలు, ఇతర అవసరమైన సౌకర్యాలు సమగ్రంగా అందేలా క్యాంపస్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. నిర్మాణ పనులను వేగవంతం చేయడంతో





పాటు నాణ్యతా ప్రమాణాలు, సాంకేతిక నిబంధనలు, ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ యంత్రాంగం ప్రధాన లక్ష్యమని కలెక్టర్ అంకిత్ అన్నారు . ప్రతి అధికారి తన పరిధిలోని పనులపై పూర్తి అవగాహన కలిగి, క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ పర్యటనలో తహసీల్దార్ అశోక్ కుమార్, ఎంపీడీవో వివేక్ చంద్ర, ఆర్ఐ, సర్వే అధికారులు, రెవెన్యూ, గృహ నిర్మాణ, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హమారా ప్రసాద్ ను అరెస్ట్ చేసి, రాజద్రోహం కేసు నమోదు చేయాలి

- **హమారా ప్రసాద్ ను రాష్ట్ర బహిష్కరణ చేయాలి**
- **జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్**
- **కండ్లకు గంతలు కట్టుకొని,ప్లకార్డులతో జేబీపీ నిరసన**

**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 15 (భద్రాద్రి న్యూస్) :** భారత రాజ్యాంగ నిర్మాత,ప్రపంచ మేధావి అంబేద్కర్ గారి పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ,అంబేద్కర్ గారి పై ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా కల్పిత నాయకుడు అని పుస్తకం రాస్తున్న హమారా ప్రసాద్ ను తక్షణమే అరెస్ట్ చేసి, రాజద్రోహం కేసు నమోదు చేసి రేవంత్ రెడ్డి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ డిమాండ్ చేశారు.మంగళవారం పార్టీ శ్రేణులతో కలిసి బస్టాండ్ తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద కండ్లకు గంతలు కట్టుకొని ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కామేష్ మాట్లాడుతూ గత కొంత కాలంగా అంబేద్కర్ గారి పై హమారా ప్రసాద్ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఆయనను అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ మతోన్మాదులు వెనుక ఉండి హమారా ప్రసాద్ తో అంబేద్కర్ కు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఈ నెల 18వ తేదీన విడుదల చేస్తాను అని ప్రకటించిన కల్పిత నాయకుడు పుస్తకాన్ని ఆవిష్కరించకుండా చూడాల్సిన భాధ్యత అన్ని పార్టీలపై ఉందన్నారు. శాసనసభ సమావేశాలు జరుగుతున్న ప్రస్తుత తరుణంలో, అంబేద్కర్ గారు రచించిన రాజ్యాంగం ద్వారా పదవులలో ఉన్న,తెలంగాణ అసెంబ్లీకి సంబంధించిన ఒక్క ఎమ్మెల్యే గానీ, ఎమ్మెల్సీ గానీ ఈ అంశంపై మాట్లాడకపోవడం దారుణమన్నారు. అంబేద్కర్ గారు రాసిన రాజ్యాంగం లోని ఆర్టికల్ 3 వల్లనే తెలంగాణ రాష్ట్రం సాకారమైంది, కాబట్టే ఈ రోజు తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ఉన్నారని మీ నాయకుడు రాహుల్ గాంధీ దేశం మొత్తం రాజ్యాంగాన్ని పట్టుకొని



తిరుగుతుంటే రాష్ట్రంలో మాత్రం హమారా ప్రసాద్ అంబేద్కర్ ను విమర్శిస్తుంటే చర్యలు తీసుకోకపోవడం లోని ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. కాబట్టి రాజ్యాంగాన్ని గౌరవించవలసిన పదవిలో ఉన్న రేవంత్ రెడ్డి గారు ఈనెల 18వ తేదీన పుస్తక ఆవిష్కరణను నిలువరించాలని, లేదంటే తర్వాత జరిగే పరిణామాలకు రేవంత్ రెడ్డి సర్కార్ పూర్తి బాధ్యత వహించాలన్నారు. అంబేద్కర్ గారి పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న హమారా ప్రసాద్ ను అరెస్ట్ చేసి, రాజద్రోహం కేసు నమోదు చేసి, రాష్ట్ర బహిష్కరణ చేసి రాష్ట్రంలో శాంతి, భద్రతలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ వీరు నాయక్,అసెంబ్లీ అధ్యక్షుడు నాగుల రవికుమార్,మున్నా,కిరణ్,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# పాల్వంచలో హరుడు.. హైదరాబాద్‌లో భాస్కరుడు!

- **కేటీపీఎస్ (ఖుఖూ) అకౌంట్స్, అడ్మినిస్ట్రేషన్ విభాగాల్లో పోస్టింగులు--ప్రమోషన్లపై సమగ్ర విచారణ జరపాలి..**
- **దళిత ఉద్యోగులపై చిన్న చూపు....**
- **నేషనల్ అంబేద్కర్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తాలూకా రాజేష్ డిమాండ్**



**పాల్వంచ, సెప్టెంబర్ 15( భద్రాద్రి న్యూస్):** కేటీపీఎస్ ఏడవ దశ **( VII STAGE)** తో పాటు వివిధ పవర్ స్టేషన్లలోని అకౌంట్స్, అడ్మినిస్ట్రేషన్ విభాగాల్లో పోస్టింగులు, ప్రమోషన్లు, కీలక బాధ్యతల కేటాయింపుల విషయంలో అర్హులైన ఉద్యోగులకు అన్యాయం జరుగుతోందనే ఆరోపణలపై ఉన్నతస్థాయి సమగ్ర విచారణ జరపాలని నేషనల్ అంబేద్కర్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తాలూకా రాజేష్ డిమాండ్ చేశారు. కేటీపీఎస్ అకౌంట్స్ విభాగంలో **SAO-I, AAO-V** పోస్టులు, సుమారు పదేళ్లుగా ఒకే చోట కొనసాగుతున్న అధికారుల వ్యవహారం, సాంక్షన్ పోస్టుల స్థితి, అర్హత ఉన్న సీనియర్ ఉద్యోగులను పక్కనపెట్టి కొందరికి ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆరోపణలపై సంబంధిత రికార్డులను పరిశీలించి నిజానిజాలు తేల్చాలని ఆయన కోరారు. “పాల్వంచలో హరుడు.. హైదరాబాద్‌లో భాస్కరుడు” అనే విధంగా కొందరి ప్రభావం కొనసాగుతోందనే ఆరోపణలు ఉద్యోగుల్లో చర్చకు వస్తున్నాయని, హైదరాబాద్ కేంద్రంగా బినామీ పేర్లతో రియల్ ఎస్టేట్ వ్యవహారాలు నడుస్తున్నాయనే ఆరోపణలు కూడా తమ దృష్టికి వచ్చాయని రాజేష్ పేర్కొన్నారు. ఈ ఆరోపణల్లో వాస్తవం ఎంత ఉందో విజిలెన్స్, సంబంధిత ఉన్నతాధికారులు పూర్తిస్థాయి విచారణ జరిపి తేల్చాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రతి పవర్ స్టేషన్‌లో అకౌంట్స్, అడ్మినిస్ట్రేషన్ విభాగాల్లో తమకు అనుకూలమైన వ్యక్తులకు మాత్రమే పదవులు, కీలక బాధ్యతలు కట్టబెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయని, ప్రమోషన్ అర్హత ఉన్నా లేకపోయినా కొందరికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడం వెనుక ఉన్న కారణాలు ఏమిటో స్పష్టం చేయాలని అన్నారు. **CE(T&D)** పరిధిలో ఉన్న పోస్టును **(VII Stage)** ఏడవ దశకు తీసుకువచ్చి ఒక వ్యక్తికి కేటాయించడం వెనుక ఉన్న నిబంధనలు, అధికారిక ఉత్తర్వులు, కారణాలను బహిర్గతం చేయాలని రాజేష్ డిమాండ్ చేశారు. ఇలాంటి నిర్ణయాలకు సంబంధించి చైర్మన్, డైరెక్టర్లు ఎందుకు స్పందించడం లేదని, సంస్థలో ఇలాంటి వ్యవహారాలపై ఉన్నత యాజమాన్యం దృష్టి పెట్టకపోవడానికి కారణమేంటని ప్రశ్నించారు. మహిళా ఉద్యోగులను కూడా ఉపయోగించుకుంటూ పరిపాలనా వ్యవహారాలను ప్రభావితం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని, వాటిపై కూడా ఎటువంటి పక్షపాతం లేకుండా విచారణ జరిపి నిజానిజాలు తేల్చాలని ఆయన కోరారు.

“అధికారాన్ని అడ్డుపెట్టుకుని అర్హులైన దళిత ఉద్యోగులకు మాత్రమే కాదు, ఇతర కులాలకు చెందిన ఉద్యోగులకు కూడా అన్యాయం జరిగితే నేషనల్ అంబేద్కర్ సేన సహించదు. మా సంఘం కుల, మత భేదాలు లేకుండా ప్రతి ఉద్యోగికి న్యాయం జరిగేలా పనిచేస్తుంది” అని తాలూకా రాజేష్ స్పష్టం చేశారు. ప్రమోషన్ రికార్డులు, సీనియారిటీ జాబితాలు, రోస్టర్ పాయింట్లు, పోస్టింగ్ ఉత్తర్వులు, బదిలీ పాలసీ అమలు, సాంక్షన్ పోస్టులు, దీర్ఘకాలిక పోస్టింగులు తదితర అంశాలపై సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, అవసరమైతే సంబంధిత దర్యాప్తు సంస్థల ద్వారా కూడా విచారణ జరిపించాలని కోరారు. “రియల్ ఎస్టేట్ వ్యవహారాలు, అధికార దుర్వినియోగం, పోస్టింగులు--ప్రమోషన్లలో అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వస్తున్నప్పుడు విజిలెన్స్ అధికారులు ఏం చేస్తున్నారు? అవసరమైతే **CID, CBI** వంటి దర్యాప్తు సంస్థలు కూడా వాస్తవాలను పరిశీలించాలి. సంస్థ ఉన్నతాధికారులు, చైర్మన్, డైరెక్టర్లు తక్షణమే స్పందించి ఉద్యోగుల్లో ఉన్న అనుమానాలను



నివృత్తి చేయాలి” అని రాజేష్ అన్నారు. **SAO 1** సీనియార్టీ లేకుండా కట్టిపెట్టడమేంది ప్రమోషన్ లో వచ్చిన వ్యక్తికి ౹ాూూ2 ఇవ్వకుండా రహస్యాలు ఏమిటి తక్షణమే ౹ాూూ1 సీనియార్టీ ఉన్న వ్యక్తికి ప్రమోషన్లు వచ్చిన వ్యక్తికి ఇవ్వకుంటే హైదరాబాదులో సంబంధించిన మంత్రివర్యులు పవర్ మినిస్టర్ గారికి ఎనర్జీ సెక్రెటరీ చైర్మన్ డైరెక్టర్ గారు మరియు సంబంధించినటువంటి డైరెక్టర్ ను కూడా కలుస్తాము . **SAO 1**అధికారిని పెత్తనమా లేకుంటే డి వై సి సి ఏ **( DYCCA)** పెత్తనం మొత్తం కూడా తనే నడిపిస్తుంది ౹ాూూ1 అది ఎవరు చూసుకొని ఆమె ఈ విధంగా చేస్తుంది అంటే వీలున్నరు కాబట్టే ఈ విధంగా భ్రష్టు పట్టిస్తున్నారు కావున తక్షణమే వీరిని ట్రాన్స్ఫర్ చేయవలసిందిగా మా డిమాండ్. ఉద్యోగుల సమస్యలపై అధికారులు స్పందించకపోతే ప్రతి పవర్ స్టేషన్‌లో మాత్రమే కాకుండా హైదరాబాద్ విద్యుత్ సౌధ గేటు ముందు శాంతియుత ధర్నా, నిరసనలు, అవసరమైతే నిరాహార దీక్ష చేపడతామని ఆయన హెచ్చరించారు. “ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న అకౌంట్స్, అడ్మినిస్ట్రేషన్ విభాగాల ప్రతి ఉద్యోగికి న్యాయం జరిగేలా నా వంతు కృషి చేస్తాను. ఏ ఉద్యోగికి ఎలాంటి అన్యాయం జరిగినా నేషనల్ అంబేద్కర్ సేన అండగా ఉంటుంది. ఉద్యోగులు తమ సమస్యలను మా దృష్టికి తీసుకురావాలి. న్యాయం జరిగే వరకు వారి తరఫున పోరాడుతాం” అని తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తాలూకా రాజేష్ తెలిపారు.

ద నేషనల్ అంబేద్కర్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు తాలూకా రాజేష్..

## తెలంగాణ రక్షణ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బాధ్యతలు చేపట్టిన సముద్రాల క్రాంతి కుమార్



**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 15 (భద్రాద్రి న్యూస్) :** తెలంగాణ రక్షణ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బాధ్యతలను సముద్రాల క్రాంతి కుమార్ చేపట్టారు. పార్టీ అధిష్ఠానం తనపై నమ్మకంతో జిల్లా బాధ్యతలను అప్పగించిన నేపథ్యంలో ఆయన తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవితను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా బాధ్యతలు అప్పగించినందుకు కల్వకుంట్ల కవితకు సముద్రాల క్రాంతి కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలు, పట్టణాలు, గ్రామాల్లో పార్టీ కార్యకలాపాలను విస్తరించడంతో పాటు ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం ప్రజల తరఫున పోరాటాలు నిర్వహించేందుకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. యువత, మహిళలు, కార్మికులు, రైతులు, విద్యార్థులు తదితర వర్గాలను పార్టీతో అనుసంధానం చేసేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తెలంగాణ రక్షణ సేనకు బలమైన కేడర్‌ను నిర్మించేందుకు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయంతో ముందుకు సాగుతానని సముద్రాల క్రాంతి కుమార్ స్పష్టం చేశారు. పార్టీ అధినేత కల్వకుంట్ల కవిత సూచనలు, ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ జిల్లాలో పార్టీకి ప్రజల్లో మరింత ఆదరణ తీసుకురావడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని తెలిపారు.

## వినాయక మండపంలో విద్యుదాఘాతం.. పుట్టినరోజే మృత్యు ఒడికి

**- మృతుడు సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుడు బానోతు విష్ణు**



**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 15 (భద్రాద్రి న్యూస్) :** పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి కేక్ కట్ చేయాల్సిన ఆ యువకుడు కొద్ది క్షణాల్లోనే విగతజీవిగా మారాడు. వినాయక మండపంలో లైట్ ఏర్పాటు చేస్తున్న క్రమంలో విద్యుత్ ఘాతానికి గురై సింగరేణి కాంట్రాక్టు కార్మికుడు మృతి చెందిన విషాద సంఘటన ఆదివారం రాత్రి చుంచుపల్లి మండలం ధన్బాద్ పంచాయతీ పరిధిలోని తండాలో చోటుచేసుకకాగా, ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ధన్బాద్ పంచాయతీ పరిధిలోని తండాకు చెందిన బానోత్ హరి--ఆశా దంపతుల కుమారుడు బానోతు విష్ణు (24). సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని ఆర్‌సీహెచ్‌పీలో ఓపెన్ ఏరియా క్లీనింగ్ విభాగంలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి తండా యువకులంతా కలిసి వినాయక విగ్రహాన్ని తీసుకొచ్చి మండపంలో ప్రతిష్ఠించారు. అనంతరం విగ్రహం కోసం విద్యుత్ దీపాన్ని ఏర్పాటు చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ సరఫరా కావడంతో విష్ణు ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే అక్కడే ఉన్న స్నేహితులు అతడికి ప్రథమ చికిత్స అందించి కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ విష్ణు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి హరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తగూడెం టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. పుట్టినరోజు సందర్భంగా కొడుకు కేక్ కట్ చేయాల్సిన సమయంలో.. అతడి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించాల్సి రావడంతో తల్లి ఆశా కన్నీరుమున్నీరుగా విలపించిన తీరు అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. “కేక్ కోయాల్సిన నా కొడుకు శరీరాన్ని పోస్టుమార్టంలో కోస్తున్నారే..” అంటూ ఆమె రోదించిన తీరు హృదయాలను కలచివేసింది. కొడుకు పుట్టినరోజును ఆనందంగా జరుపుకోవాల్సిన కుటుంబం.. అతడి అంతిమయాత్రకు సిద్ధం కావాల్సి రావడం స్థానికులను తీవ్రంగా కలిచివేసింది. యువకుడి మరణ వార్త తెలుసుకొన్న కొత్తగూడెం వ్యవసాయ కమిటీ చైర్మన్ లాల్ సింగ్, బీఆర్ఎస్ చుంచుపల్లి మండలాధ్యక్షుడు గూడేల్లి యాకయ్య, సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, బానోత్ రాందాస్, సలిగంటి శ్రీనివాస్, పూల రవీందర్, భూక్య రవి, రేషన్ డీలర్ అసోసియేషన్ ట్రెజరర్ బానోత్ బాలు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## నిరుద్యోగ ఉద్యమ కళాకారులను వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలి

**- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారులకు సారథిలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలి**



**వైరా, సెప్టెంబర్ 15, (భద్రాద్రి న్యూస్) :** ఖమ్మం జిల్లా పట్టణ మున్సిపాలిటీ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ రథసారథులు అమరవీరుల స్థూపం దగ్గర సోమవారం తెలంగాణ ఉద్యమంలో ప్రత్యేక రాష్ట్రం కోసం కీలక పాత్ర పోషించిన ఉద్యమ నిరుద్యోగ కళాకారులకు ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాకారులు మాట్లాడుతూ గోసి, గొంగడి వేసి, కాళ్లకు గజ్జలు కట్టి రేయింబవళ్లు, పాట పాడుతూ, గంతులేస్తూ, తెలంగాణ ఉద్యమ గీతాలను ఊరూరా ప్రచారం చేస్తూ, అనేక ఉడుదుడులను ఎదుర్కొని, జైలు గోడలను సైతం లెక్కచేయకుండా, కుటుంబాలను భార్య పిల్లలను వదిలేసి, తెలంగాణ రాష్ట్రం కోసం అహర్నిశలు శ్రమించిన కళాకారులకు, ఆనాటి బిఆర్ఎస్ ప్రభుత్వం 550 సారథి ఉద్యోగాలను కల్పించింది, కానీ ప్రతిభ ఉండి తెలంగాణ రాష్ట్రం కోసం శ్రమించిన నిజమైన నిరుద్యోగ కళాకారులను మరిచిపోయిందని ఇప్పటికే కళాకారులకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వకుండా 12 సంవత్సరాలు దాటిందని, కాంగ్రెస్ ప్రభుత్వంలో నిజమైన అర్హులకు సారథిలో ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు వెంటనే నోటిఫికేషన్ ఇవ్వాలని వెయ్యి ఉద్యోగాలు తప్పకుండా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ఉద్యమ నిరుద్యోగ కళాకారులు పాతకోటి నరసింహారావు, కాలంగి లలిత, మోదుగు గోవిందరావు, అద్దంకి నరసింహారావు లక్ష్మీకాంతం, తిప్పారపు నాగేంద్రబాబు, పేరాల నగేష్,కర్ష పుల్లయ్య, నారాటి చంద్రమోహన్, ఎస్.కె ప్రకృతి ద్దేన్, పెద్దపాక విజయ్, బొడ్డు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

## కాంగ్రెస్ పార్టీకిబొబ్బిలి పవన్ కళ్యాణ్ రాజీనామా!



**గుండాల సెప్టెంబర్ 15 భద్రాద్రి న్యూస్ :** రాజకీయాల్లో ఊహించని సంచలనం చోటుచేసుకుంది. కాంగ్రెస్ పార్టీలో తనదైన శైలిలో ప్రజా సమస్యలపై పోరాడుతూ, పార్టీకి ప్రశ్నించే గొంతుకగా పేరుగాంచిన గుండాల మండల యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ మరియు సోషల్ మీడియా కోఆర్డినేటర్ “బొబ్బిలి పవన్ కళ్యాణ్” పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తీవ్ర మనస్తాపంతోనే ఈ నిర్ణయం: పార్టీ సిద్ధాంతాలను నమ్ముకుని, క్షేత్రస్థాయిలో రాత్రింబవళ్లు శ్రమించిన కార్యకర్తలకు గుర్తింపు దక్కకపోవడం, ప్రజా సమస్యల పరిష్కారంలో నాయకత్వ వైఖరిపై తీవ్ర అసంతృప్తి చెందడమే ఈ రాజీనామాకు ప్రధాన కారణమని తెలుస్తోంది.

“పార్టీ కోసం, ప్రజల కోసం ఎల్లవేళలా ముందంజలో ఉండి పోరాడాం. కానీ కష్టపడే కార్యకర్తల ఆవేదనను నాయకత్వం పట్టించుకోకపోవడం బాధాకరం. అందుకే ప్రజాపక్షాన నిలబడటానికే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నా.”

--- బొబ్బిలి పవన్ కళ్యాణ్

మండల రాజకీయాల్లో యువజన విభాగాన్ని, సోషల్ మీడియా రంగాన్ని బలంగా ముందుకు నడిపించిన కీలక నాయకుడు పవన్ కళ్యాణ్ రాజీనామా చేయడం గుండాల మండలంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆయన తీసుకున్న ఈ నిర్ణయం స్థానిక కాంగ్రెస్ వర్గాలకు కోలుకోలేని దెబ్బ అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. రాబోయే రోజుల్లో పవన్ కళ్యాణ్ తన తదుపరి రాజకీయ భవిష్యత్తుపై మరియు కార్యకర్తలతో కలిసి తీసుకోబోయే నిర్ణయాలపై పూర్తి స్పష్టతనిచ్చే అవకాశం ఉంది.

# గిరిజనులను మోసం చేసిన రేవంత్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలి

**- బిఆర్ఎస్ జిల్లా గిరిజన నాయకుడు మూడ్ కృష్ణ ప్రసాద్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు**

**కామేపల్లి,సెప్టెంబర్ 15(భద్రాద్రి న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో పరిపాలిస్తున్న రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రజా పాలన ప్రభుత్వం పై తీవ్రంగా గిరిజన నాయకులు మండిపడ్డారు. వారు చేస్తున్న తీరును గిరిజనులను చేస్తున్న తీవ్ర అన్యాయాన్నికి జీర్ణించుకోలేక పోతున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలలో ఒక్కటి కూడా సక్రమంగా అమలు చేయడం లేదని బిఆర్ఎస్ గిరిజన ఉమ్మడి జిల్లా నాయకుడు , కృష్ణ ప్రసాద్ నాయక్ విమర్శించారు. గిరిజనులను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుని,ఎన్నికల తరువాత వారి సంక్షేమాన్ని,ఆర్థిక, రాజకీయ, సామాజిక అభివృద్ధిని విస్మరిస్తూ తీవ్ర అవమానాలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ?ఎన్నికల వేళ గిరిజనులకు 12% రిజర్వేషన్లు చట్టపరంగా కల్పిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్, ప్రస్తుతం అమలులో ఉన్న 10% రిజర్వేషన్లను కూడా సరిగా అమలు చేయకపోవడం దారుణమన్నారు. గిరిజనులకు రాజకీయంగా రావాల్సిన క్యాబినెట్లో ఉన్న మంత్రి పదవి ప్రాతినిధ్యాన్ని, ఇవ్వకపోవడం గిరిజన భూములను లాక్కోవడం,గిరిజన హక్కులను కాలరాయడం కాంగ్రెస్ నైజమని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను మళ్లించడమే కాకుండా,గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధిని తీవ్రంగా నిర్లక్ష్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, గిరిజనులకు 10% రిజర్వేషన్లు కల్పించి,ఆదివాసీ గూడేలలో మౌలిక సదుపాయాలు కల్పించి,గిరిజనుల ఆత్మగౌరవాన్ని కాపాడింది కేవలం కేసీఆర్ నేతృత్వంలోని బిఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆయన గుర్తుచేశారు. రానున్న రోజుల్లో గిరిజనులు, ఆదివాసీల హక్కుల సాధన కోసం బిఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. ?ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల గిరిజన నాయకులు ఎల్.భీమా,ఎల్. బాలాజీ,డి.కిషన్, డి.రవి,డి. నరసింహారావు, సోమేశ్,తదితరులు పాల్గొన్నారు.



# మిషన్ భగీరథ మండల అధికారులపై ముచ్చర్ల వాసుల తీవ్ర ఆగ్రహం

- **గ్రామంలో పడకేసిన తాగునీటి సరఫరా పట్టించుకోని మిషన్ భగీరథ ఏఈ**
- **గ్రామ పంచాయితీ ట్యాంకరే దిక్కు.. గొంతు తడుపుకుంటున్న గ్రామ ప్రజలు**
- **చొరవ చూపిన గ్రామ సర్పంచ్ జాటోత్ జాయ్ లూసీ**





**కామేపల్లి,సెప్టెంబర్ 15(భద్రాద్రి న్యూస్):**-గ్రామ ప్రజలకు ఇంటింటికీ రక్షిత తాగునీరు అందిస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన'మిషన్ భగీరథ'పథకం ద్వారా ప్రజలకు అందించవలసిన త్రాగునీటి సమస్యల పై అధికారులు న్యాయం చేయక పట్టించుకోకపోక గాలికి వదిలేశారు ఇలా కామేపల్లి మండలంలో అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా మారింది. మండలంలోని ముచ్చర్ల గ్రామంలో గత కొన్ని రోజులుగా భగీరథ నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో స్థానికులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కానీ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా స్పందించకపోవడంతో మిషన్ భగీరథ అధికారుల తీరుపై గ్రామస్థులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**- గ్రామ సర్పంచ్ స్పందనతో తాత్కాలిక ఊరట**

గ్రామంలో నీటి కొరత తీవ్రమవడాన్ని గుర్తించిన స్థానిక సర్పంచ్ జాటోత్ జాయ్ లూసీ సోమవారం తక్షణమే స్పందించారు.ఆమె సొంత చొరవతో నీటి ట్యాంకర్‌ను తెప్పించి, గ్రామంలోని పలు వీధులకు నీటిని సరఫరా చేయించారు. సర్పంచ్ చొరవతో తాత్కాలికంగా దాహార్తి తీరినప్పటికీ, అసలు సమస్యను పరిష్కరించడంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

**- సరఫరా పునరుద్ధరించకుంటే ఆందోళన బాట!**

ప్రజాప్రతినిధులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తూ ప్రజల ఇబ్బందులను తీరుస్తున్నా, సంబంధిత అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇకనైనా మిషన్ భగీరథ అధికారులు నిద్రమత్తు వదిలి, గ్రామానికి భగీరథ నీటి సరఫరాను తక్షణమే సక్రమంగా పునరుద్ధరించాలని, లేనిపక్షంలో మండల కేంద్రంలో అధికారుల తీరుకు నిరసనగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు. అలాగే గత 15 రోజుల ముందు ఇదే వ్యవహారం మొదలైనప్పటికీ పత్రిక ద్వారా పర్చూరించడంతో అధికారులు స్పందించి ఏదో ఒక సమస్యని తీసుకొచ్చి చెప్పినప్పటికీ గ్రామ ప్రజలు సొద్దుకు ఉన్నారు. మళ్లీ అదే సమస్య ఎదురయింది మిషన్ భగీరథ

ఏ ఈ స్పందించకపోవడంతో మంచినీటి సమస్య తీవ్రస్థాయికి చేరుకొని తీరపైకి వచ్చింది జిల్లా అధికారులు స్పందించి ప్రజల దాహం తీర్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఇటు రాష్ట్ర ప్రభుత్వానికి అట్టు జిల్లా అధికారులను నిలదీస్తామని ప్రజలు నాయకులు ధర్నాలు చేస్తామని హెచ్చరించారు

# జాబ్ మేళా పేరుతో డైవర్షన్ రాజకీయాలు

**కోదాడ, సెప్టెంబర్ 15(భద్రాద్రి న్యూస్):** జాబ్ మేళాల నిర్వహణకు తాము వ్యతిరేకం కాదని, అయితే ప్రభుత్వ ఉద్యోగాల భర్తీపై ఇచ్చిన హామీలను విస్మరించి నిరుద్యోగుల దృష్టిని ప్రైవేట్ ఉద్యోగాల వైపు మళ్లించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. మంగళవారం కోదాడ మండల పరిధిలోని అల్వాల పురం గ్రామంలో తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఏడాదికి రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్ ఇస్తామని హామీ ఇచ్చి.. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 67,763 ఉద్యోగాలు భర్తీ చేశామని చెబుతున్నప్పటికీ.. అందులో కాంగ్రెస్ నోటిఫికేషన్ల ద్వారా భర్తీ అయినవి 16,978 మాత్రమేనని, మిగిలిన ఉద్యోగాలు గత బీఆర్ఎస్ ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ల ద్వారా భర్తీ అయినవేనని మల్లయ్య యాదవ్ పేర్కొన్నారు. గ్రూప్-1, డీఎస్సీ వంటి నియామకాల్లోనూ గత ప్రభుత్వం ఇచ్చిన పోస్టులను కాంగ్రెస్ తన ఖాతాలో వేసుకుంటోందని విమర్శించారు.రాష్ట్రంలో పోలీస్ శాఖలో వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెబుతూనే తక్కువ సంఖ్యలో పోస్టులను మాత్రమే భర్తీకి ప్రకటించడం ఏమిటని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన రూ.4 వేల నిరుద్యోగ భృతి ఇప్పటివరకు అమలు కాలేదని అన్నారు. ప్రైవేట్ కంపెనీల్లో రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు వేతనాలతో ఉద్యోగాలు ఇప్పించి.. వాటినే ప్రభుత్వ ఘనతగా ప్రచారం చేసుకోవడం నిరుద్యోగ యువతను అవమానించడమేనని మల్లయ్య యాదవ్ అన్నారు. కోదాడ, హుజూర్‌నగర్‌లో జాబ్ మేళాల నిర్వహణకు చూపుతున్న శ్రద్ధను ప్రభుత్వ శాఖల్లోని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఖాళీల భర్తీపై ఎందుకు చూపడం లేదని ప్రశ్నించారు. ఖాళీలను అధికారికంగా ప్రకటించి అర్హులైన నిరుద్యోగులకు పారదర్శకంగా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.హుజూర్‌నగర్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నిర్వహించిన జాబ్ మేళాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని మల్లయ్య యాదవ్ సవాల్ విసిరారు. ఇప్పటివరకు ఎన్ని జాబ్ మేళాలు నిర్వహించారు, ఎంతమంది నిరుద్యోగులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు, ఎంతమంది ఎంపికయ్యారు, వాస్తవంగా ఎంతమందికి ఉద్యోగాలు లభించాయనే పూర్తి వివరాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు.జాబ్ మేళాల పేరుతో ప్రచారం కాకుండా.. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని ఆయన కోరారు. తెలంగాణ యువతకు ఇచ్చిన ఉద్యోగ హామీలపై ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన సమయం వచ్చిందని మల్లయ్య యాదవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు షేక్ నయీమ్, కౌన్సిలర్ చీమ నరేష్, పైడిమరి సత్తిబాబు, భూపాల్ రెడ్డి, పొట్ట కిరణ్ కుమార్, సంపేట ఉపేందర్, షేక్ కరీం, మహిళా నాయకురాలు పిట్టల భాగ్యమ్మ, కందుల శ్రీకాంత్, క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# యువతకు ఉద్యోగ అవకాశాలే లక్ష్యం..

**- ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు ఉండొద్దు**

**కోదాడ, సెప్టెంబర్ 15(భద్రాద్రి న్యూస్):** నిరుద్యోగ యువతకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా సెప్టెంబర్ 19న కోదాడలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళాను విజయవంతం చేసేందుకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. మంగళవారం కోదాడ పట్టణంలోని సీసీ రెడ్డి కాన్వెంట్‌లో మెగా జాబ్ మేళా ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు.జాబ్ మేళాకు పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువత హాజరయ్యే అవకాశం ఉన్నందున అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. అభ్యర్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, కంపెనీల ప్రతినిధులకు అవసరమైన సౌకర్యాలు, వాహనాల పార్కింగ్, తాగునీటి వసతి, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై అధికారులతో సమగ్రంగా సమీక్షించారు.శాఖల వారీగా బాధ్యతలను స్పష్టంగా కేటాయించి, అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. జాబ్ మేళాకు వచ్చే ప్రతి అభ్యర్థికి అవసరమైన సమాచారం, సౌకర్యాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అర్హత కలిగిన ప్రతి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశం లభించేలా కంపెనీల ప్రతినిధులతో సమన్వయం చేసుకుని జాబ్ మేళాను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.అదేవిధంగా కార్యక్రమ ప్రాంగణంలో రద్దీ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, వాహనాల పార్కింగ్‌కు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. అభ్యర్థుల రాకపోకలు సులభంగా ఉండేలా ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. జాబ్ మేళా నిర్వహణలో ఎలాంటి చిన్నపాటి లోపానికీ తావులేకుండా ముందుగానే అన్ని ఏర్పాట్లను పరిశీలించి పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ఈ సమీక్ష సమావేశంలో కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి, జిల్లా ఎస్పీ కే. నరసింహ, కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ రమాదేవితో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



# ప్రజా సేవకుడికి జాతీయ సేవారత్న పురస్కారం

**- రామవరం పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ ముస్తఫాకు సత్కారం**

**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 15 (భద్రాద్రి న్యూస్) :** ప్రజా సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తూ సమాజ సేవలో ముందుకు సాగుతున్న రామవరం పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ ముస్తఫాకు జాతీయ సేవారత్న పురస్కారం లభించింది. ఇన్పాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ 15వ వార్షికోత్సవ సభను బెంగళూరులో నిర్వహించగా, వివిధ రంగాల్లో సేవలందిస్తున్న స్వచ్ఛంద సంస్థలకు చెందిన సుమారు వందమంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితుడిగా మహమ్మద్ ముస్తఫా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ... జాతీయ భావంతో కూడిన జీవన విధానాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. మనిషిని మనిషిగా గౌరవించే సమాజ నిర్మాణానికి నేటి యువత ప్రధానంగా ముందుకు కదలాలని పిలుపునిచ్చారు. సమాజంలో మానవతా విలువలు, పరస్పర గౌరవం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని సూచించారు. తాను స్వగ్రామంలో నిర్వహించిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలను గుర్తించి ఈ పురస్కారం అందించడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ అవార్డు తనది కాదని, తన గ్రామ ప్రజలదని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని ప్రజా సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఈ పురస్కారం ప్రోత్సాహంగా నిలుస్తుందన్నారు. తన సేవలను గుర్తించి జాతీయ సేవారత్న పురస్కారానికి ఎంపిక చేసిన ఇన్పాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఫౌండర్, ప్రెసిడెంట్ ఎస్. శివరాజుకు మహమ్మద్ ముస్తఫా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పురస్కారాన్ని ఐఆర్ఎస్ కస్టమ్స్ అధికారి డాక్టర్ జల్దె విద్యాధర్, ధర్మవరపు నరేందర్‌రెడ్డి, సంస్థ అధ్యక్షుడు సోమల శివరాజు చేతుల మీదుగా అందుకున్నారు.



# ప్రజా సంక్షేమం గ్రామ అభివృద్ధే లక్ష్యం

**-- స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసిన సర్పంచ్ అచ్చమ్మ**



**కామేపల్లి,సెప్టెంబర్ 15(భద్రాద్రి న్యూస్):** ప్రజా సంక్షేమం గ్రామ అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం ముందుకు సాగుతున్నామని సర్పంచ్ అరెం అచ్చమ్మ స్పష్టం చేశారు. మండలంలోని కెప్టెన్ బంజర గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం మంగళవారం గ్రామంలో నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ అచ్చమ్మ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన కుటుంబాలకు సంక్షేమ పథకాలు మరింత సులభంగా అందుతాయని తెలిపారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం నిరంతరం ప్రజల కోసం అనేక పథకాలను అమలు చేస్తుందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో పనిచేస్తున్న ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు అనంతరం గ్రామ సర్పంచ్ అరెం అచ్చమ్మ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ జిపిఓ వెంకన్న , సెక్రటరీ రామ్ లాల్, రేషన్ డీలర్ విజయ్ , ఉపసర్పంచ్ పవన్ , గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, నాయకులు గ్రామస్థులు పాల్గొన్నారు.

# కోదాడ డివిజన్ నాలుగవ తరగతి ఉద్యోగుల సమితి నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక

**ఉద్యోగుల సంక్షేమానికి నూతన కమిటీ కృషి చేయాలి... రాష్ట్ర అధ్యక్షుడు వంటేపాక సోమేష్**



**కోదాడ, సెప్టెంబర్ 15(భద్రాద్రి న్యూస్):** కోదాడ పట్టణంలో గల స్థానిక బాయ్స్ హై స్కూల్ నందు నాలుగవ తరగతి ఉద్యోగుల సమితి రాష్ట్ర అధ్యక్షుడు వంటేపాక సోమేష్, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బోల్లేపల్లి నాగయ్య ల సమక్షంలో మంగళవారం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షులుగా దానియేలు, అసోసియేట్ అధ్యక్షులు గా మహబూబ్,ఉపాధ్యక్షులు అబ్దుల్ గఫూర్, ప్రధాన కార్యదర్శి దుర్గారావు,సంయుక్త కార్యదర్శి మధు, కోశాధికారి జానిమియా, కో ఆప్షన్ సభ్యులు కాషయ్య, ప్రచార కార్యదర్శి ఆసిఫ్,ఈసీ మెంబర్ లు జ్యోతి,నాగేశ్వరరావు, కార్యాలయ కార్యదర్శి బిక్షం లను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి నాయకులు అభినందనలు తెలుపుతూ నాలుగో తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల పరిరక్షణకు నూతన కమిటీ కట్టుబడి పనిచేయాలని రాష్ట్ర, జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీను, జిల్లా కోశాధికారి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్టు కార్మికులు బానిసలు కాదు

**- సీఐటీయూ ఏరియా ప్రధాన కార్యదర్శి పిచ్చేటి శివ**



**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 15 (భద్రాద్రి న్యూస్) :** సింగరేణి కొత్తగూడెం ఏరియాలో పని చేస్తున్న పారిశుధ్య కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ కొత్తగూడెం ఏరియా ప్రధాన కార్యదర్శి పిచ్చేటి శివ డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులను బానిసల కంటే హీనంగా చూస్తున్నారనే భావన వారిలో నెలకొంటోందని, ఇలాంటి పరిస్థితులు మారాల్సిన అవసరం ఉందన్నారు. మంగళవారం సీఐటీయూ కాంట్రాక్టు కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వీపింగ్, స్కావెంజింగ్ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. పని వేళల్లో చిన్న తప్పులు జరిగినా ఆబ్సెంట్ వేస్తున్నారని, దీనివల్ల తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు. ఈ సందర్భంగా పిచ్చేటి శివ మాట్లాడుతూ... కాంట్రాక్టు కార్మికులు యంత్రాలు కాదని, మనుషులనే విషయాన్ని అధికారులు గుర్తుంచుకోవాలని అన్నారు. కార్మికులపై ఒత్తిడి పెంచడం, వేధింపులకు గురిచేయడం సరికాదని పేర్కొన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి సంఘం అండగా ఉంటుందని తెలిపారు. సమస్యలను పరిష్కరించకుండా ఇబ్బందులకు గురిచేస్తే సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటం చేపడతామని హెచ్చరించారు. కార్మికుల శ్రమను గుర్తించి, వారికి గౌరవప్రదమైన పని వాతావరణం కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కన్వీనర్ బుక్య రమేష్, ట్రెజరర్ ప్రమోద్, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

# రామకృష్ణాపురంలో ఘనంగా వినాయక ఉత్సవాలు

**- వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు.. అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకుడు గుడిపూడి తిరుమల రావు**



**సింగరేణి, సెప్టెంబర్ 15 (భద్రాద్రి న్యూస్ రాములు):** వినాయక చవితి ఉత్సవాలు సింగరేణి మండలంలో భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా రేగులగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని రామకృష్ణాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని కాంగ్రెస్ నాయకుడు గుడిపూడి తిరుమల రావు సందర్శించారు. వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పిట్టల మధు ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో తిరుమల రావు పాల్గొని భక్తులతో కలిసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామంలో భక్తుల సందడి నెలకొంది. తిరుమల రావు మాట్లాడుతూ విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో రామకృష్ణాపురం గ్రామ ప్రజలతో పాటు సింగరేణి మండల ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రజల్లో ఐక్యత, సోదరభావం, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వొరికొర్ల వీరభద్రం, షేక్ హాజీమియా, పొట్లకాయల మహేష్, సామినేని తిరుపతిరావు, పిట్టల మధు, అడప వెంకటేశ్వర్లు, సంతోష్, సురేష్, చిన్న వెంకన్న, సాయికుమార్, కళ్యాణ్, కార్తీక్, చింతకాయల రామకృష్ణ, వాసు రమేష్, దొడ్డ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# "అన్నా" అంటే పలికే సర్పంచ్.. హీరాలాల్

**– ప్రజా సమస్యలపై తక్షణ స్పందన.. భాగ్యనగర్ తండాలో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి**

**కారేపల్లి, సెప్టెంబర్ 15 (భద్రాద్రి న్యూస్ రాములు ):** ప్రజల మధ్య ఉంటూ.. వారి సమస్యలను తెలుసుకుంటూ.. పరిష్కారానికి వెంటనే స్పందించే సర్పంచ్‌గా భాగ్యనగర్ తండా గ్రామపంచాయతీ సర్పంచ్ బానోత్ హీరాలాల్ ముందుకు సాగుతున్నారు. ప్రజలు తమ సమస్యలను చెప్పగానే వాటిని పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నారు. భాగ్యనగర్ తండాలోని పలు ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ ఉండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని గుర్తించిన సర్పంచ్ హీరాలాల్, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు చేపట్టారు. అవసరమైన ప్రాంతాలను గుర్తించి మోరీల నిర్మాణ పనులు ప్రారంభించడంతో పాటు పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. మురుగునీరు రోడ్లపైకి చేరకుండా, నీటి నిల్వల కారణంగా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. నిర్మాణ పనులు వేగంగా పూర్తయ్యేలా సంబంధిత సిబ్బందితో సమన్వయం చేస్తూ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు.

**ప్రజలతో మమేకమై..**

సర్పంచ్ హీరాలాల్ వ్యవహరిస్తున్న తీరుపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. "అన్నా" అని పిలిస్తే వెంటనే స్పందించే వ్యక్తిగా, ప్రజలకు అందుబాటులో ఉండే సర్పంచ్‌గా ఆయన తమ సమస్యలను పట్టించుకుంటున్నారని గ్రామస్థులు పేర్కొంటున్నారు. పదవిని బాధ్యతగా భావిస్తూ గ్రామ అవసరాలను గుర్తించి ముందుకు సాగుతున్నారని తెలిపారు. గ్రామంలో మౌలిక వసతులను మరింత మెరుగుపరచడంతో పాటు ప్రజలకు అవసరమైన సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావడమే తన లక్ష్యమని సర్పంచ్ బానోత్ హీరాలాల్ తెలిపారు. ప్రజల సహకారంతో భాగ్యనగర్ తండాను మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.



# తాగునీటి సమస్యపై సర్పంచ్ తక్షణ స్పందన

**– పేరుపల్లి రోడ్డు వద్ద మోటార్‌కు మరమ్మతులు**

**కారేపల్లి, సెప్టెంబర్ 15 (భద్రాద్రి న్యూస్ రాములు ):** పోలం పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పేరుపల్లి రోడ్డు వద్ద పనిచేయకుండా నిలిచిపోయిన మోటార్‌కు మరమ్మతులు చేపట్టేందుకు సర్పంచ్ హేమలత బాలాజీ తక్షణ చర్యలు చేపట్టారు. మోటార్ పనిచేయకపోవడంతో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని గుర్తించిన సర్పంచ్, సమస్యను వెంటనే పరిష్కరించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. మోటార్‌కు అవసరమైన మరమ్మతులు పూర్తి చేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజలకు తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా మోటార్లు, నీటి సరఫరా వ్యవస్థను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. గ్రామపంచాయతీ పరిధిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని సర్పంచ్ హేమలత బాలాజీ తెలిపారు.



# గణపతి మండపాల వద్ద నిబంధనలు పాటించాలి

**- నిబంధనలు పాటిస్తూ ప్రశాంతంగా ఉత్సవాలు నిర్వహించాలి: ఎస్సై బైరు గోపి**

**కారేపల్లి, సెప్టెంబర్ 15 (భద్రాద్రి న్యూస్ రాములు ):** గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు మండపాల నిర్వాహకులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సింగరేణి ఎస్సై బైరు గోపి సూచించారు. ఉత్సవాల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. సింగరేణి మండల పరిషత్ కార్యాలయంలో గణపతి మండపాల వద్ద చేపట్టాల్సిన భద్రతా చర్యలు, విద్యుత్ భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ తదితర అంశాలపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మార్వో, ఎంపీడీవో, ఎంపీఓ, ఎస్సై బైరు గోపి, విద్యుత్ శాఖ ఏఈ, సర్పంచుల సంఘం అధ్యక్షుడు భూక్య రంజిత్ కుమార్తో పాటు వివిధ గ్రామపంచాయతీల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, జీపీఓలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మండపాల నిర్వాహకులు పాటించాల్సిన నిబంధనలపై పలు సూచనలు చేశారు. మండపాల వద్ద విద్యుత్ వైర్లు, కనెక్షన్లు, లైటింగ్ ఏర్పాట్ల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. భక్తులు, మహిళలు, చిన్నారులు, వృద్ధులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

**ముందస్తు జాగ్రత్తలతోనే భద్రత**

ఎస్సై బైరు గోపి మాట్లాడుతూ మండపాల నిర్వాహకులు, గ్రామపంచాయతీ సిబ్బంది, పోలీసు శాఖతో సమన్వయం చేసుకుంటూ ఉత్సవాలను నిర్వహించాలని అన్నారు. భద్రత విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రతి అంశాన్ని ముందుగానే పరిశీలించుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలు, అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా, సురక్షితంగా, భక్తి వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, పోలీసు మరియు అధికార యంత్రాంగానికి నిర్వాహకులు, ప్రజలు సహకరించాలని ఎస్సై బైరు గోపి కోరారు.



# విఘ్నేశ్వరుని సన్నిధిలో సర్పంచ్ దంపతుల ప్రత్యేక పూజలు

**ప్రజల సంక్షేమం.. యువత భవిష్యత్.. గ్రామాభివృద్ధి కోసం ప్రత్యేక ప్రార్థనలు**

**కారేపల్లి, సెప్టెంబర్ 15 (భద్రాద్రి న్యూస్ రాములు):** సింగరేణి మండలం భాగ్యనగర్ తండాలోని 4వ వార్డులో కొలువై ఉన్న విఘ్నేశ్వర స్వామి మండపం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భాగ్యనగర్ తండా సర్పంచ్ బానోత్ హిరలాల్--సుమ దంపతులు విఘ్నేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దంపతులు మాట్లాడుతూ.. విఘ్నేశ్వర స్వామి ఆశీస్సులతో గ్రామ ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, వారు చేపట్టే ప్రతి శుభకార్యంలో విఘ్నాలు తొలగి విజయాలు చేకూరాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజల సంక్షేమం, శాంతి, సౌభ్రాతృత్వం మరింత బలపడాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.

యువత భవిష్యత్తుపై ప్రత్యేక ఆకాంక్ష : గ్రామ యువత చదువుల్లో ఉన్నత ప్రతిభ కనబరిచి, తమకు నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. విద్య, ఉద్యోగం, ఉన్నత భవిష్యత్తు దిశగా యువత ముందుకు సాగేందుకు విఘ్నేశ్వర స్వామి ఆశీస్సులు, శక్తి ప్రసాదించాలని కోరుకున్నారు.

**గ్రామాభివృద్ధి నిరాటంకంగా సాగాలి**

విఘ్నేశ్వర స్వామి ఆశీస్సులతో భాగ్యనగర్ తండాలో అభివృద్ధి కార్యక్రమాలు నిరాటంకంగా కొనసాగాలని, ప్రజలకు మరింత మెరుగైన మౌలిక వసతులు అందేలా గ్రామాభివృద్ధి ముందుకు సాగాలని సర్పంచ్ దంపతులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండపం నిర్వహణ కమిటీ సభ్యులు రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, ప్రసాద్, శ్రీరాజ్ తదితరులు పాల్గొన్నారు.



# రైతు కూలీల హక్కుల కోసం కదం తొక్కాలి

**- 28న ఖమ్మంలో ఏఐకేఎంఎస్ భారీ బహిరంగ సభ.. పెద్ద సంఖ్యలో తరలిరావాలి**

**కారేపల్లి, సెప్టెంబర్ 15 (భద్రాద్రి న్యూస్ రాములు ):** రైతులు, వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నాయని ఏఐకేఎంఎస్ ఖమ్మం జిల్లా కార్యదర్శి వై. ప్రకాష్ విమర్శించారు. రైతాంగం, వ్యవసాయ కూలీల సమస్యలపై పోరాటాన్ని మరింత ఉధృతం చేసేందుకు ఈనెల 28న ఖమ్మం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఏఐకేఎంఎస్ నాలుగో జాతీయ మహాసభల సందర్భంగా నిర్వహిస్తున్న ఈ బహిరంగ సభకు రైతులు, వ్యవసాయ కూలీలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. అలాగే ఈనెల 29, 30 తేదీల్లో ఖమ్మంలో నిర్వహించే ఏఐకేఎంఎస్ నాలుగో జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కారేపల్లి మండలం పేరుపల్లి గ్రామంలో ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు రైతులకు పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, కనీస వేతన చట్టాన్ని అమలు చేస్తామని ప్రభుత్వాలు హామీలు ఇచ్చాయని గుర్తుచేశారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాలను, నాలుగు లేబర్ కోడులను రద్దు చేస్తామని ప్రకటించినప్పటికీ, వాటి అమలులో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. హామీలు అమలు కాకపోవడంతో రైతులు, వ్యవసాయ కూలీలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతాంగం, వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ప్రకాష్ పేర్కొన్నారు. ఈనెల 28న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని, ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేలా ఉద్యమాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కంచర్ల శ్రీనివాస్‌రెడ్డి, అల్లం గురువయ్య, నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, పద్మ, సుగుణ, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.




# గుడిబండలో గణేష్ వేడుకలు

**కోదాడ, సెప్టెంబర్ 15, భద్రాద్రి న్యూస్ :** కోదాడ మండల పరిధిలోని పాత గుడిబండ గ్రామంలో కమ్యూనిటీ హాలు వద్ద గణేష్ ఉత్సవ కమిటీ మట్టి బొజ్జ గణపయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం గణేష్ మండపంలో గ్రామ ఎనిమిదో వార్డు నెంబర్ పులి అనిత , పులి ఏడుకొండల దంపతులు పీటలపై కూర్చొని స్వామివారికి విశేష రీతిలో పూజలు జరిపారు. ప్రధాన పూజారి సూచనల మేరకు ఈ దంపతులు స్వామివారికి ఫలాలు ,పండ్లు, నైవేద్యాలను సమర్పించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# విద్యుత్ కోతలను ఎత్తివేయాలి

**- రైతులకు 24 గంటల విద్యుత్ అందించాలి: అఖిలభారత ఐక్య రైతు సంఘం**

**కారేపల్లి, సెప్టెంబర్ 15 (భద్రాద్రి న్యూస్ రాములు ):** విద్యుత్ కోతలను వెంటనే ఎత్తివేసి రైతులకు 24 గంటల పాటు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ అనుబంధ అఖిలభారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సింగరేణి మండలం భాగ్యనగర్ 33/11 కేవీ సబ్‌స్టేషన్ ఎదుట మంగళవారం నిర్వహించిన ఈ ఆందోళనలో రైతులు, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ మండల కార్యదర్శి గుమ్మడి సందీప్ మాట్లాడుతూ.. రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. తరచూ విద్యుత్ కోతలు విధించడం వల్ల రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వర్షాభావ పరిస్థితులతో పంటలు ఎండిపోతున్న సమయంలో బోర్ల ద్వారా పంటలకు నీరందించేందుకు అవసరమైన విద్యుత్ అందుబాటులో లేక రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. అఖిలభారత ఐక్య రైతు సంఘం ఖమ్మం డివిజన్ నాయకుడు తేజ నాయక్ మాట్లాడుతూ విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వేడి, ఉక్కపోత కారణంగా ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యుత్ కోతలను ఎత్తివేసి ప్రజలకు నిరంతర విద్యుత్ అందించాలని, రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ మండల నాయకులు పుల్లకాని సత్తిరెడ్డి, రావుల నాగేశ్వరరావు, భూక్య నాగరాజు, అఖిలభారత ఐక్య రైతు సంఘం మండల సభ్యులు గుమ్మడి ఎర్రయ్య, గుమ్మడి నరసింహారావు, రామారావు, కోడెం సీతారాములు, జోగ రవి, దోమల సుజాత, గుమ్మడి శిరీష, స్వర్ణభాకా అనసూయ, మోకాళ్ల కోటయ్య, దోమల కోటయ్య, దోమల నాగేశ్వరావు, గుమ్మడి నిర్మల తదితరులు పాల్గొన్నారు.




# న్యూజెర్సీలో డా. ప్రదీప్ కూరపాటికి ఘన సన్మానం

**– వైద్య, సామాజిక సేవలను గుర్తించిన నాపా..**

**– 13వ జాతీయ కన్వెన్షన్‌లో సత్కారం**




**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 15 (భద్రాద్రి న్యూస్):** వైద్య రంగంలో సేవలందిస్తూ, మరోవైపు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొంటున్న డా. ప్రదీప్ కూరపాటికి అమెరికాలోని న్యూజెర్సీలో ఘన సన్మానం లభించింది. న్యూజెర్సీలో సెప్టెంబర్ 12న నిర్వహించిన 13వ జాతీయ నార్త్ అమెరికన్ పద్మశాలి అసోసియేషన్ (నాపా) కన్వెన్షన్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, విశిష్ట అతిథుల సమక్షంలో నిర్వాహకులు డా. ప్రదీప్ కూరపాటిని ఘనంగా సత్కరించారు.

**సేవలను గుర్తించి..**

వైద్య వృత్తిలో భాగంగా ప్రజలకు వైద్య సేవలు అందించడంతో పాటు సమాజం పట్ల బాధ్యతతో పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో డా. ప్రదీప్ కూరపాటి భాగస్వామ్యం అవుతున్నారని నిర్వాహకులు పేర్కొన్నారు. వైద్య సేవలతో పాటు సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తూ సమాజానికి తనవంతు సేవ అందిస్తున్న ఆయనను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.

**ఘనంగా జాతీయ కన్వెన్షన్ :** నార్త్ అమెరికన్ పద్మశాలి అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాతీయ కన్వెన్షన్‌కు అమెరికాలోని వివిధ ప్రాంతాల నుంచి పద్మశాలి సంఘాల ప్రతినిధులు, ప్రముఖులు హాజరయ్యారు. సామాజిక, సాంస్కృతిక, సేవా రంగాలకు సంబంధించిన పలు అంశాలపై కార్యక్రమంలో చర్చలు, సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరుస్తూ సమాజ సేవకు తోడ్పడుతున్న పలువురిని నిర్వాహకులు సన్మానించారు. అందులో భాగంగా డా. ప్రదీప్ కుమార్ కూరపాటి ని సన్మానించడం పట్ల ఆయనను అభినందించేందుకు పలువురు ప్రముఖులు ముందుకొచ్చారు. వైద్య రంగంలో అందిస్తున్న సేవలతో పాటు సామాజిక కార్యక్రమాల్లో ఆయన చేస్తున్న కృషికి ఈ గుర్తింపు దక్కడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

# చిరుత పులి చర్మం స్వాధీనం.. ఆరుగురు అరెస్ట్!

**- వన్యప్రాణుల వేటగాళ్లకు అటవీ శాఖ గట్టి షాక్.. అక్రమాలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవు**

**- జాతీయ వన్యప్రాణులను చంపినా.. చర్మాలు, అవయవాలు తరలించినా ఉపేక్షించం: ఎఫ్ఆర్ఓ రంజిత**

**చర్ల సెప్టెంబర్ 15 (భద్రాద్రి న్యూస్) :** అడవికి రక్షణగా నిలవాల్సిన వన్యప్రాణులనే వేటాడి వాటి చర్మాలతో అక్రమ వ్యాపారానికి తెరలేపుతున్న వేటగాళ్లపై అటవీ శాఖ కొరడా ఝుళిపించింది. చిరుత పులిని వేటాడి, దాని చర్మాన్ని అక్రమంగా తరలించేందుకు ప్రయత్నించిన ఘటనలో ఆరుగురు నిందితులను అటవీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి చిరుత పులి చర్మాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. వన్యప్రాణులను వేటాడటం, చంపడం, వాటి చర్మాలు, అవయవాలను అక్రమంగా తరలించడం, విక్రయించడం తీవ్రమైన నేరమని అధికారులు స్పష్టం చేశారు. అడవుల్లో వేటకు పాల్పడి మూగజీవాల ప్రాణాలను బలితీసుకునే వారిపై ఇకపై మరింత కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

**వేటగాళ్లకు ఇక వేటే!**

ఎఫ్ఆర్ఓ రంజిత మాట్లాడుతూ.. వన్యప్రాణుల సంరక్షణ కోసం అటవీ శాఖ నిఘాను మరింత పటిష్టం చేసిందన్నారు. చిరుత పులులు, ఇతర అరుదైన వన్యప్రాణులను చంపినా, వాటి చర్మాలు లేదా అవయవాలను అక్రమంగా తరలించినా చట్టం నుంచి తప్పించుకోవడం సాధ్యం కాదని హెచ్చరించారు. నిందితులకు చట్ట ప్రకారం కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. చిరుత పులి చర్మం స్వాధీనం ఘటనపై అధికారులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు. ఈ అక్రమ వేట వెనుక మరెవరైనా ఉన్నారా? వన్యప్రాణుల చర్మాల అక్రమ రవాణా, విక్రయాలకు సంబంధం ఉన్నవారెవరైనా ఉన్నారా? అనే కోణాల్లో విచారణ కొనసాగుతోంది. ప్రమేయం ఉన్నట్లు తేలిన ప్రతి ఒక్కరిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. అడవులు, వన్యప్రాణులు మన సహజ సంపద. వాటిని నాశనం చేసే వేటగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, నిందితులకు చట్టపరంగా తగిన శిక్ష పడేలా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



Printed, Published and Owned by CHENGAPONGUSAIDULU,and printed at KAKATI BABU PRINTERS H No.4-10.Telagarama varam,Laximidevipally, Kothagudem -507101,Dist .Bhadradri kothagudem, Telangana. And Published At HNo. DA-416,Babu camp,chunchupalli (M), Kothagudem-507101,Dist Bhadradri kothagudem, Telangana.Editor: CHENGAPONGU SAIDULU. RNI TELTEL 2023/90682Call No.6302329046